RNI No. APTEL/2012/53127

TELANGANA VANI TELUGU DAILY

# తెలంగాణ వాణి

తెలుగు దినపత్రిక

The Voice of Telangana

Published From KARIMNAGAR, HYDERABAD, ADILABAD, NIZAMABAD, WARANGAL, KHAMMAM, NALGONDA,

సంపుటి: 16 సంచిక 12 ఎడిటర్: జేరిపోతుల సంపత్, కరీంనగర్ బుధవారం 15-04-2026 పేజీలు: 8, వెల : 2.00

తెలంగాణ వాణి

R N I No. APTEL/2012/53127

విలేకరులు కావలెను

తెలంగాణ వాణి దినపత్రికలో పనిచేయుటకు సిటీ బ్యూరో, జిల్లా బ్యూరోలు, నియోజకవర్గం, మండలాలవారీగా అనుభవం కలిగిన రిపోర్టర్లు కావలెను. ఆసక్తిగలవారు ఈ క్రింది నెంబరుకు సంప్రదించగలరు.

9182328292



## ఇరాన్‌తో చర్చలు సానుకూలమే..

**బంతి వారి కోర్టులోనే ఉంది**
**అమెరికా వైస్ ప్రెసిడెంట్ జేడీ వాన్స్**

ఢిల్లీ,:ఇరాన్‌తో అణు కార్యక్రమంపై జరిపిన చర్చల్లో గణనీయమైన పురోగతి సాధించామని, అయితే కీలకమైన డిమాండ్ల విషయంలో వాషింగ్టన్ పట్టువీడకపోవడంతో ఒప్పందం కుదరలేదని అమెరికా వైస్ ప్రెసిడెంట్ జేడీ వాన్స్ తెలిపారు. పాకిస్థాన్‌లో అత్యున్నత స్థాయిలో జరిగిన ఈ చర్చలు ఫలప్రదం కాలేదని ఆయన స్పష్టం చేశారు. ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో ఆయన ఈ విషయాలను వెల్లడించారు. అమెరికా, ఇరాన్ ప్రభుత్వాలు ఇంత ఉన్నత స్థాయిలో సమావేశమవడం ఇదే మొదటిసారని ఆయన పేర్కొన్నారు.

2వ పేజీలో...

# అంబేద్కర్‌కు ప్రధాని మోదీ నివాళి



2వ పేజీలో...

**ఖర్గేతో కాసేపు ముచ్చట్లు..**

న్యూఢిల్లీ: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి ఇవాళ. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ పార్లమెంట్ ఆవరణలోని ప్రేరణా స్థల్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళి అర్పించారు. ప్రగతిశీల సమాజం నిర్మాణం కోసం అంబేద్కర్ ఆశయాలు నిరంతరం ప్రేరణ కలిగిస్తాయని అన్నారు. ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, స్పీకర్ ఓం బిర్లా కూడా నివాళి అర్పించారు.



## భానుడు భగభగ

**అల్లాడుతున్న ప్రజలు**
**40 డిగ్రీలకు చేరిన పగటి ఉష్ణోగ్రతలు**
**బయటకు రావాలంటేనే జంకుతున్న జనం**

వరంగల్, : ఉమ్మడి వరంగల్ జిల్లాలో భానుడు ప్రతాపం చూపిస్తున్నాడు. వారం రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు అనూహ్యంగా పెరగడంతో నిప్పుల కొలిమిని తలపిస్తోన్నది. ఉదయం 8 గంటల నుంచే ఎండ తీవ్రత పెరుగుతుండడంతో జనం బయటకు రావాలంటేనే జంకుతున్నారు. ముఖ్యంగా విద్యార్థులు, చిరు వ్యాపారులు, బాటసారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మధ్యాహ్నం కాకముందే రోడ్లు నిప్పుల కొలిమిలా మారుతుండడంతో జనజీవనం స్తంభించిపోతున్నది.

2వ పేజీలో...



## అమెరికా, ఇరాన్ మధ్య రెండో రౌండ్ చర్చలు

2వ పేజీలో...

**ఇస్లామాబాద్ లేదా జెనీవాలో మీటింగ్ !**

న్యూఢిల్లీ: అమెరికా, ఇరాన్ మధ్య పాకిస్థాన్‌లో రెండో దఫా చర్చలు జరిగే అవకాశం ఉన్నది. రెండు దేశాల ప్రతినిధులు గత వారం ఇస్లామాబాద్‌లో భేటీ అయిన విషయం తెలిసిందే. అయితే మొదటిసారి జరిగిన చర్చల్లో శాంతి ఒప్పందం కుదరలేదని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ పేర్కొన్న విషయం తెలిసిందే. దీంతో ఆ చర్చలు అసమగ్రంగా ముగిశాయి. ఇక సీజ్‌ఫైర్ గడువు సమీపిస్తున్న నేపథ్యంలో మరోసారి అమెరికా, ఇరాన్ చర్చల ప్రక్రియపై సుముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది.





## దేశానికి గాంధీ, అంబేద్కర్ రెండు కళ్లు

- బలమైన దేశంగా ఎదగడానికి బాబా సాహెబ్ కృషి
- తెలంగాణలో దళితులు అభ్యున్నతికి పెద్దపీట
- దళితబిడ్డలు ఉన్నత పదవుల్లో ఉంటే ఓర్వలేకపోతున్నారు
- ప్రస్తుత డీలిమిటేషన్‌తో తెలంగాణకు తీరని అన్యాయం
- అంబేడ్కర్ జయంతి వేడుకల్లో సిఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, :దేశానికి గాంధీ, అంబేద్కర్ రెండు కళ్లలాంటి వారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.స్వాతంత్య్ర పోరాటంలో మహాత్మా గాంధీ పాత్ర ఎంత ఉందో.. దేశాభివృద్ధిలో అంబేద్కర్ పాత్ర అంతే ఉందన్నారు. లోయర్ ట్యాంక్‌బండ్‌లో నిర్వహించిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సీఎం మాట్లాడుతూ.. ఆ ఇదకదరు మహానుభావులు దేశానికి రెండు కళ్లలాంటి వారని అన్నారు. రక్తం చిందకుండా యుద్ధం గెలవచ్చని గాంధీ నిరూపించారు. బలమైన దేశంగా భారత్ ఎదగడానికి అంబేద్కర్ కృషి చేశారు. ప్రజల కలలు సాకారం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. అలాగే తెలంగాణ ఉద్యమంలో గద్దర్ పాత్రను ఎవరూ మర్చిపోలేరని సీఎం తెలిపారు. గత ప్రభుత్వ కేబినెట్‌లో దళితులకు ప్రాధాన్యం ఇవ్వలేదని విమర్శించారు. కాంగ్రెస్ కేబినెట్‌లో దళితులకు ప్రాధాన్యం ఇచ్చామ న్నారు. దళిత బిడ్డ బడ్జెట్ ప్రవేశపెడితే చూడలేకపోతున్నారంటూ విమర్శించారు. గతంలో భట్టి విక్రమార్కకు సీఎల్పీ నేత హోదాను తొలగించేలా కుట్రలు జరిగాయని సీఎం రేవంత్ ఆరోపించారు. ఎస్సీ నాయకుడు స్పీకర్‌గా, ఆర్థిక మంత్రిగా ఉండకూడదా అని ప్రశ్నించారు. గత పదేళ్లలో ఎనాడైనా డైట్ ఛార్జీలు పెంచారా అని నిలదీశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కడితే ఓర్వలేక పోతున్నారంటూ వ్యాఖ్యానించారు.

2వ పేజీలో...



2వ పేజీలో...

## అతిపెద్ద అంబేడ్కర్ విగ్రహం ఘనత కెసిఆర్‌దే

**గురుకులాల్లో రణ మృదంగం మోగుతోంది**
**అంబేడ్కర్ జయంతి వేడుకల్లో బిఆర్ఎస్ నేత కెటిఆర్**

హైదరాబాద్,ఏప్రిల్14 : బీఆర్ఎస్ కార్యాలయంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడుతూ.. పోరాడితే పోయేదేమీ లేదన్న శ్రీశ్రీ చెప్పిన మాట నిజం అయిందని.. ప్రపంచంలోనే అతిపెద్ద అంబేడ్కర్ విగ్రహాన్ని కేసీఆర్ ఏర్పాటు చేశారని తెలిపారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహానికి సంకెళ్లు వేసి బందీ చేసిందని ఆరోపించారు. ఈసారి బందీ చేస్తే సంకెళ్లు బద్దలు కొడతామని పిలుపు ఇచ్చిన వెంటనే విగ్రహాన్ని ఓపెన్ చేశారని వ్యాఖ్యానించారు. అంబేడ్కర్ తత్వం 'బోధించు, సమీకరించు, పోరాడు'తోనే కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారని కేటీఆర్ పేర్కొన్నారు.



## రేవంత్ జీడీపీ ఫార్ములా వర్కౌటవుతుందా..?

హైదరాబాద్,: నియోజకవర్గాల పునర్విభజన అంశం ఇప్పుడు భారత రాజకీయాల్లో ఒక సెన్సిటివ్ వార్ జోన్‌గా మారింది. కేంద్ర ప్రభుత్వం జనగణన తర్వాత 50 శాతం సీట్ల పెంపు ఫార్ములాతో వడివడిగా అడుగులు వేస్తోంది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దీనిపై ధ్వజమెత్తుతున్నారు. కేవలం సీట్ల పెంపు అనేది అంకెల గారడీ మాత్రమేనని, ఇది దక్షిణాది రాష్ట్రాల గొంతు నొక్కడమేనని ఆయన స్పష్టం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రేవంత్ రెడ్డి లేవనెత్తుతున్న అభ్యంతరాలు, ఆయన ప్రతిపాదిస్తున్న జీడీపీ ఫార్ములా ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి.కేంద్రం ఆలోచిస్తున్న 50 శాతం సీట్ల పెంపు ప్రతిపాదనను రేవంత్ రెడ్డి పూర్తిగా తోసిపుచ్చుతున్నారు. అందరికీ సమానంగా సీట్లు పెంచినప్పటికీ, అంతిమంగా ఉత్తరాది రాష్ట్రాల ఆధిపత్యమే కొనసాగుతుందని ఆయన విశ్లేషిస్తున్నారు. ముఖ్యంగా ఉత్తరాదిలోని కేవలం నాలుగు రాష్ట్రాల ఎంపీ సీట్లతోనే కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసే పరిస్థితి వస్తే, అది సమాఖ్య స్ఫూర్తికి గొడ్డలిపెట్టు అని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దక్షిణాది రాష్ట్రాలు దశాబ్దాలుగా కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు జనాభా నియంత్రణ పాటించాయి. విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో అద్భుత ప్రగతి సాధించాయి. ఇప్పుడు కేవలం జనాభా తక్కువగా ఉన్నారనే కారణంతో పార్లమెంట్‌లో మా ప్రాతినిధ్యాన్ని తగ్గించడం అంటే.. క్రమశిక్షణతో ఉన్నందుకు మాకు ఇస్తున్న శిక్షా? అని రేవంత్ రెడ్డి సూటిగా ప్రశ్నిస్తున్నారు. ఈ సంక్లిష్ట సమస్యకు రేవంత్ రెడ్డి ఒక వినూత్నమైన, హేతుబద్ధమైన పరిష్కారాన్ని ప్రతిపాదించారు.

2వ పేజీలో...



## పవర్ ప్లాంట్‌లో బాయిలర్ పేలుడు

**9 మంది కార్మికులు మృతి,**
**30 మందికి తీవ్ర గాయాలు**

ఛత్తీస్‌గఢ్: ఛత్తీస్‌గఢ్‌లో ఘోర ప్రమాదం సంభవించింది. పవర్ ప్లాంట్‌లో బాయిలర్ పేలుడు సంభవించి, 9 మంది కార్మికులు మృతి చెందారు. శక్తి జిల్లా, సింగితరాయ్‌లోని వేదాంత పవర్ ప్లాంట్‌లో మంగళవారం (ఏప్రిల్ 14) మధ్యాహ్నం సుమారు 2 గంటలకు ఈ ప్రమాదం జరిగింది. బాయిలర్ పేలుడు సంభవించడంతో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. ఈ ఘోర ప్రమాదంలో సుమారు 30 మంది కార్మికులు తీవ్రంగా గాయపడగా, వారిలో తొమ్మిది మంది చికిత్స పొందుతూ మరణించారు. గాయపడిన మిగిలిన వారి పరిస్థితి విషమంగా ఉంది. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. శక్తి జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ప్రఫుల్ ఠాకూర్ తొమ్మిది మంది కార్మికుల మృతిని ధృవీకరించారు. ఈ ఘటన తర్వాత ప్లాంట్ ప్రాంగణంలో భయాందోళన నెలకొంది. సహాయక, రెస్క్యూ ఆపరేషన్లు వేగంగా కొనసాగుతున్నాయి. స్థానిక యంత్రాంగం, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నారు. ప్రమాదానికి గల కారణం ప్రస్తుతం తెలియరాలేదు.

2వ పేజీలో...

# ఇరాన్‌తో చర్చలు సానుకూలమే..



మొదటిపేజీ తరువాయి...

చర్చల్లో కొన్ని సానుకూల అంశాలు ఉన్నప్పటికీ, ఇరాన్ తమ డిమాండ్లకు తగినంతగా స్పందించలేదని వాన్స్ అన్నారు. "ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాన్ని కలిగి ఉండకూడదు" అనేదే తమ ప్రధాన సూత్రమని ఆయన తెలిపారు. దీనికోసం రెండు కఠినమైన తగ్గని షరతులను ఇరాన్ ముందు ఉంచినట్లు వివరించారు. మొదటిది, ఇరాన్‌లోని యురేనియం నిల్వలను పూర్తిగా దేశం బయటకు తరలించడం. రెండవది, అణ్వాయుధాలను అభివృద్ధి చేయబోమని కచ్చితమైన, ధ్రువీకరించదగిన హామీ ఇవ్వడం. "ఇరాన్ మాట ఇస్తే సరిపోదు, దానిని ధ్రువీకరించే పటిష్టమైన వ్యవస్థ ఉండాలి" అని ఆయన అన్నారు. చర్చల పురోగతిని కీలకమైన అంతర్జాతీయ ఇంధన మార్గమైన హర్మూజ్ జలసంధిని పూర్తిగా తెరవడంతో ముడిపెట్టినట్లు వాన్స్ తెలిపారు. ఇరాన్ ఈ విషయంలో లక్ష్యాలను మార్చే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు.

ఇరాన్ నౌకాశ్రయాలకు వెళ్లే లేదా అక్కడి నుంచి వచ్చే అన్ని నౌకలను అమెరికా నిఘా వ్యవస్థలతో లక్ష్యంగా చేసుకుంటున్నామని ఆయన ధ్రువీకరించారు.

హర్మూజ్ జలసంధిలో నౌకాయానానికి ముప్పు కలిగించడం ద్వారా ఇరాన్ ప్రపంచాన్ని ఆర్థికంగా దెబ్బతీస్తోందని ఆయన ఆరోపించారు. ఇలా చేస్తే, వారి నౌకలు కూడా బయటకు వెళ్లలేవు అని వాన్స్ హెచ్చరించారు. చర్చల్లో పాల్గొన్న ఇరాన్ ప్రతినిధులు, తాము పెట్టిన షరతులకు ఆమోదం పొందేందుకు టెహ్రాన్‌కు తిరిగి వెళ్లాల్సి ఉందని ఆయన చెప్పారు. సైనిక ఆధిక్యం, ఆర్థిక దిగ్బంధనం ద్వారా తమకు చర్చల్లో పూర్తి పట్టు ఉందని, బంతి ఇప్పుడు ఇరాన్ కోర్టులోనే ఉందని వాన్స్ వ్యాఖ్యానించారు.

# రేవంత్ జీడీపీ ఫార్ములా వర్కౌటవుతుందా..?

మొదటిపేజీ తరువాయి...

నియోజకవర్గాల కేటాయింపు కేవలం జనాభా మీద, లేదా నిర్దిష్టంగా 50శాతం అని కాకుండా, ఆయా రాష్ట్రాలు దేశ ఆర్థిక వ్యవస్థకు అందిస్తున్న సహకారం ఆధారంగా ఉండాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు. దేశానికి అత్యధిక ఆదాయాన్ని సమకూరుస్తున్న దక్షిణాది రాష్ట్రాలకు నిర్ణయాధికారంలోనూ అంతే ప్రాధాన్యత ఉండాలని కోరుతున్నారు. అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల రాజకీయ బలాన్ని తగ్గించడం వల్ల భవిష్యత్తులో రాష్ట్రాల మధ్య అసమానతలు పెరుగుతాయని రేవంత్ రెడ్డి హెచ్చరిస్తున్నారు. జనాభాను నియంత్రించి, ఆర్థికంగా ఎదిగిన రాష్ట్రాలను గౌరవించాలంటే జీడీపీని ఒక ప్రామాణికంగా తీసుకోవడం తప్పనిసరి అని ఆయన స్పష్టం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా, మొండిగా ముందుకు వెళ్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని రేవంత్ రెడ్డి హెచ్చరిస్తున్నారు. ఇది కేవలం రాజకీయ అంశం మాత్రమే కాదని, కోట్ల మంది దక్షిణాది ప్రజల ఆత్మగౌరవ సమస్య అని ఆయన పేర్కొన్నారు. కేంద్రం గనుక దక్షిణాది రాష్ట్రాల హక్కులను కాలరాస్తూ, ఏకపక్షంగా పునర్విభజన చేపడితే భారీ ఎత్తున ప్రజా ఉద్యమం చేపడతామని ఆయన హెచ్చరించారు. పార్లమెంట్ లోపల, బయట మా నిరసన గళం వినిపిస్తామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.



నియోజకవర్గాల పునర్విభజన రాబోయే కాలంలో దేశ సమగ్రతను ప్రభావితం చేసే అంశంగా కనిపిస్తోంది. రేవంత్ రెడ్డి లేవనెత్తుతున్న ప్రశ్నలు కేవలం తెలంగాణ కోణంలోనే కాకుండా, మొత్తం దక్షిణాది ప్రయోజనాల దృష్ట్యా అత్యంత కీలకమైనవి. 50శాతం ప్రాతిపదికన జరిగే విభజన ఉత్తరాది-దక్షిణాది మధ్య అగాధాన్ని పెంచే ప్రమాదం ఉంది. మరి కేంద్రం రేవంత్ రెడ్డి సూచిస్తున్న జీడీపీ ఫార్ములాను పరిగణనలోకి తీసుకుంటుందా లేదా అనేది వేచి చూడాలి.

# దేశానికి గాంధీ, అంబేడ్కర్ రెండు కళ్లు

మొదటిపేజీ తరువాయి...

తెలంగాణ పబ్లిక్ స్కూల్ విధానంతో పిల్లల భవిష్యత్తు మారుతుందని తెలిపారు. ఇంటిగ్రేటెడ్, పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటుకు కృషి చేస్తున్నామని చెప్పారు. అధికారంలోకి వచ్చాక 67వేల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించామన్నారు. 67వేల ఉద్యోగాల్లో 87శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకే వచ్చాయని వెల్లడించారు. పదేళ్ల విధ్వంసం.. వందేళ్ల నష్టానికి దారి తీసిందని సీఎం వ్యాఖ్యానించారు. ఆనాడు చేసిన అప్పులు చెల్లిస్తూ.. తప్పులు సరిదిద్దుతూ పాలన కొనసాగిస్తున్నామని వివరించారు. మహిళా రిజర్వేషన్లు, సీట్ల పెంపుపై కేంద్రం గందరగోళం సృష్టిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా రిజర్వేషన్ల ముసుగులో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. 50 శాతం జనాభా ఆధారంగా.. మరో 50 శాతం జీఎస్‌డీపీ ఆధారంగా హైబ్రిడ్ మోడల్‌లో డీలిమిటేషన్ చేపట్టాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ హయాంలోనే మహిళా రిజర్వేషన్ బిల్లుకు రాజ్యసభలో ఆమోదం లభించిందని.. కానీ లోక్‌సభలో కొన్ని పార్టీలు అడ్డుకున్నాయని సీఎం రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. సమాన అవకాశాలతో దేశాన్ని అభివృద్ధి పథంలో నడపవచ్చని అంబేడ్కర్ మార్గదర్శనం చేశారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

పేదలకు నాణ్యమైన విద్య కోసం గతంలో లేని విధంగా చర్యలు చేపట్టాం. తెలంగాణ పబ్లిక్ స్కూల్ విధానంతో పిల్లల భవిష్యత్ మారుతుంది. తెలంగాణ ఇంటిగ్రేటెడ్, పబ్లిక్ స్కూళ్ల ఏర్పాటుకు కృషి చేస్తున్నాం. గతంలో చేసిన అప్పులు, తప్పులను సరిదిద్దుకుంటూ ముందుకెళ్తున్నాం. పదేళ్ల విధ్వంసం.. వందేళ్ల నష్టానికి దారి తీసిందని సీఎం అన్నారు. కాంగ్రెస్ హయాంలోనే మహిళా రిజర్వేషన్ బిల్లు రాజ్యసభలో ఆమోదం పొందింది. ఈ బిల్లును లోక్‌సభలో కొన్ని పార్టీలు అడ్డుకున్నాయి. ప్రస్తుతం దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేసే ప్రయత్నం చేస్తున్నారు. దక్షిణాదిన కుటుంబ నియంత్రణ వల్ల జనాభా తగ్గి సీట్లు కోల్పోయే పరిస్థితి. కేంద్రం ఆదేశాలు పాటించి జనాభా నియంత్రణ పాటిస్తే నష్టం చేస్తున్నారు. తెలంగాణకు తీరని నష్టంపై అభ్యంతరం లేవనెత్తాం అని సీఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.



# పవర్ ప్లాంట్‌లో బాయిలర్ పేలుడు..

మొదటిపేజీ తరువాయి...

వాస్తవానికి, ఈ ప్రమాదం ఎంత తీవ్రంగా ఉందంటే, ఆ పేలుడు శబ్దం నలుమూలలకూ వినిపించింది. బాయిలర్ పేలుడు కారణంగా ప్లాంట్ ప్రాంగణంలో భయాందోళనలు నెలకొని, తొక్కిసలాట జరిగింది. ఆ సమయంలో చాలా మంది కార్మికులు విధుల్లో ఉన్నారని కంపెనీ వర్గాలు తెలిపాయి. గాయపడిన వారిని అంబులెన్స్ ద్వారా సమీపంలోని ఆసుపత్రులకు తరలించగా, అక్కడ 20 మంది కార్మికుల పరిస్థితి విషమంగా ఉంది. చికిత్స పొందుతూ ఇప్పటివరకు తొమ్మిది మంది మరణించారు.

ఈ ఘటన గురించి సమాచారం అందిన వెంటనే, శక్తి జిల్లా యంత్రాంగం, పోలీసుల ఉన్నతాధికారులు సింగితరాయ్‌కు చేరుకున్నారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, ప్లాంట్ లోపల సహాయక, రెస్క్యూ చర్యలు కొనసాగుతున్నాయి. శిథిలాల కింద ఇంకా చాలా మంది చిక్కుకుని ఉండవచ్చని భయపడుతున్నారు. ప్రమాదానికి గల కచ్చితమైన కారణం ఇంకా తెలియరాలేదు. కానీ ప్రాథమికంగా ఇది సాంకేతిక లోపం, భద్రతా ప్రమాణాలను పాటించకపోవడంతో ఈ ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు. పవర్ ప్లాంట్‌లో బాయిలర్ పేలుడు ఘటనపై ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటన విషాదకరమని, మృతులకు ఆయన ప్రగాఢ సంతాపం తెలిపారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించేలా చూడాలని అధికారులను ఆదేశించారు. దర్యాప్తు జరిపి, దోషులపై చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి తెలిపారు.

# భానుడు భగభగ

మొదటిపేజీ తరువాయి...



వీధులన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. అగ్నిధారలు కురుస్తున్నట్లు ఉన్న వాతావరణంతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే ముమ్ముం దు ఎలా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు. రాబో యే మరో మూడు నాలుగు రోజుల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీలు పెరిగే అవకాశముందని, ఉమ్మడి జిల్లాలో 41 నుంచి 44 డిగ్రీల వరకు నమోదవుతాయని ఇప్పటికే ఐఎండీ హెచ్చరించింది. ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రయాణాలు వాయి దా వేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

తప్పనిసరి అయితే తప్పా బయటకు రావొద్దని, వృద్ధులు, చిన్నారులు, రోగులు జాగ్రత్తలు తీసుకోవాలని, వడదెబ్బకు గురికాకుం డా చూసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. మహబూబాబాద్ జిల్లాలో వారం రోజులుగా 39 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు చేరుకోవడంతో మానుకోటతో పాటు డోర్నకల్, మరిపెడ, కేసముద్రం, తొర్రూరు పట్టణాలు, మండలాలు, గ్రామాల్లో ప్రజలు బయటకు రావాలంటే బయపడుతున్నారు. ఎండ తీవ్రత, ఉక్కపోత వల్ల ఫ్యాన్‌లు, కూలర్లు, ఏసీల వాడకం విపరీతంగా పెరిగింది.

## అతిపెద్ద అంబేడ్కర్ విగ్రహం ఘనత కెసిఆర్‌దే

మొదటిపేజీ తరువాయి...

గురుకులాలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. గురుకులాల్లో మరణ మృదంగం మోగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అంబేడ్కర్‌ను రాజకీయ అవసరాలకు మాత్రమే వాడుకుంటోంది తప్ప.. ఎన్నడూ నిజమైన గౌరవం ఇవ్వలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నంత కాలం అంబేడ్కర్‌కు భారతరత్న ఇవ్వలేదన్నారు. అంబేడ్కర్ అభయ హస్తం పథకాన్ని అమలు చేయకుండా ఆయనను అగౌరవపరుస్తున్నారని ఆరోపించారు. దళిత బంధు లాంటి పథకాలను తీసుకొచ్చిన కలేజా ఉన్న నాయకుడు కేసీఆర్ అని కేటీఆర్ కొనియాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ప్రభుత్వ కాంట్రాక్టుల్లో అవకాశాలు ఇస్తామని కాంగ్రెస్ మోసం చేసిందని మాజీ మంత్రి విమర్శించారు. లక్షన్నర కోట్ల కాంట్రాక్టుల్లో 72 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఇచ్చారా అని ప్రశ్నించారు. మూసి కాంట్రాక్టు ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఇస్తారా అని నిలదీశారు. కాంగ్రెస్ మోసాలను రాష్ట్రంలోని ప్రతి దళిత, బీసీ, మైనార్టీ కుటుంబాలకు చేర్చి పోరాడాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. ఏప్రిల్ 20న జగిత్యాలలో జరిగే బహిరంగ సభకు కేసీఆర్ హాజరవుతాని ప్రకటించారు. కాంగ్రెస్ డిక్లరేషన్‌పై బహిరంగ సభలు నిర్వహించేలా ఎ÷-లాన్ చేసుకోవాలని సూచించారు. పార్లమెంట్ భవనానికి అంబేడ్కర్ పేరు పెట్టాలని బీజేపీని డిమాండ్ చేశామని.. అసెంబ్లీలో తీర్మానం కూడా చేశామని కేటీఆర్ తెలిపారు. బీజేపీ, కాంగ్రెస్ వాళ్లకు ఏ మాత్రం గౌరవం ఉన్నా స్పందించే వారన్నారు. కాంగ్రెస్, బీజేపీ దొందూ దొందే అని.. అంబేడ్కర్ అంటే గిట్టని వారే అని విమర్శించారు. అంబేడ్కర్‌ను కొందరి వాడుగా చిత్రీకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని.. మహాత్మా గాంధీ లాగే అంబేడ్కర్ అందరి వాడని స్పష్టం చేశారు. 'జై భీమ్, జై కేసీఆర్, జై తెలంగాణ' నినాదాలతో ముందుకు సాగుతామని కేటీఆర్ స్పష్టం చేశారు.

# అంబేద్కర్ ఆశయాలు యువతకు స్ఫూర్తి కావాలి : జిల్లా కలెక్టర్ అంకిత్

## సమానత్వానికి పునాది భారత రాజ్యాంగం : ఎస్పీ రోహిత్ రాజు





భద్రాద్రి బ్యూరో (తెలంగాణ వాణి) డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135 వ జయంతి సందర్భంగా కొత్తగూడెం పోస్ట్ ఆఫీస్ సెంటర్ ప్రధాన కూడలిలో షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ముఖ్య అతిథులుగా పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి సభను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ప్రజలు స్వయంగా పరిపాలించుకునే విధంగా రాజ్యాంగం అవసరమైందని, దేశ వ్యాప్తంగా అనేక మంది మేధావులలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ మాత్రమే ఆ బాధ్యతను సమర్థంగా నిర్వర్తించగల వ్యక్తిగా గుర్తించబడినట్లు తెలిపారు. భారత రాజ్యాంగం రూపకల్పనలో ఆయన చేసిన కృషి అపూర్వమని, విద్య, ఆర్థిక, నీటిపారుదల తదితర రంగాలలో ఆయన చూపిన దూరదృష్టి దేశాభివృద్ధికి పునాది అయిందన్నారు. భారత రాజ్యాంగం ద్వారా ప్రతి పౌరుడికి సమాన హక్కులు లభించాయని, "ఒక వ్యక్తి -- ఒక ఓటు" అనే సూత్రాన్ని స్థిరపరిచిన గొప్ప నాయకుడు అంబేద్కర్ అని అన్నారు . కుల, మత భేదాలకు అతీతంగా సమానత్వ భావనను నెలకొల్పిన ఆయన ఆశయాలను యువత స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు . జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ , విభిన్న కులాలు, మతాలు, భాషలు, సంస్కృతులు కలిగిన దేశం అయినప్పటికీ భారతదేశం ఐక్యంగా నిలబడటానికి ప్రధాన కారణం రాజ్యాంగమని అన్నారు. ప్రపంచంలోని ఇతర దేశాలతో పోలిస్తే భారత రాజ్యాంగం చాలా తక్కువ సవరణలతోనే సమర్థవంతంగా కొనసాగుతుండటం అంబేద్కర్ దూరదృష్టికి నిదర్శనమన్నారు. సమాజంలో మానవతా విలువలకు ప్రాధాన్యం ఇస్తూ, కుల మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ సమానంగా జీవించేలా కృషి చేయాలని, అంబేద్కర్ స్ఫూర్తిని ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఏప్రిల్ 14 నుండి 20 వరకు నిర్వహించనున్న అగ్నిమాపక వారోత్సవాల గోడపత్రికను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. అలాగే రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అరైవ్-అలైవ్" కార్యక్రమంలో భాగంగా రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రహదారుల భద్రతపై ప్రత్యేకంగా ప్రతిజ్ఞ చేయించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించడం, హెల్మెట్ మరియు సీట్‌బెల్ట్ వినియోగాన్ని తప్పనిసరిగా అనుసరించడం, మద్యపానం చేసి వాహనం నడపకపోవడం, వేగ నియంత్రణ పాటించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ప్రజల ప్రాణ రక్షణలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు సామూహికంగా కృషి చేయాలని అధికారులు పిలుపునిచ్చారు.

అనంతరం కలెక్టర్ జడ్పీ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జెడ్పీ సీఈఓ నాగలక్ష్మి, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి శ్రీలత, జిల్లా రవాణా శాఖ అధికారి వెంకటరమణ, తూనికలు కొలతలు శాఖ అధికారి మనోహర్, వైద్యశాఖ అధికారి తుకారాం రాథోడ్, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సుజాత, జిల్లా అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు డాక్టర్ మద్దెల శివకుమార్, సబ్బారపు మధుసూదన్ రావు, పీక కృష్ణ, కుసపాటి శ్రీనివాస్, కోలపూరి ధర్మరాజు, సలింగటి శ్రీనివాస్, కమిటీ కో-కన్వీనర్లు, సభ్యులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## అమెరికా, ఇరాన్ మధ్య రెండో రౌండ్ చర్చలు..

మొదటిపేజీ తరువాయి...

రెండోసారి చర్చలను నిర్వహించేందుకు తాము సిద్ధంగానే ఉన్నామని పాకిస్థాన్ తెలిపింది. పాకిస్థాన్ చేసిన ప్రతిపాదనపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. వాషింగ్టన్, టెహ్రాన్ మధ్య జరిగే చర్చలను ఈసారి జెనీవాలో నిర్వహించాలన్న అభిప్రాయాలు కూడా వ్యక్తం అవుతున్నాయి. ఏప్రిల్ 21వ తేదీన కాల్పుల విరమణ గడువు ముగుస్తుంది. ఈ లోగా చర్చలు నిర్వహించాలన్న ఆలోచనలో అమెరికా ప్రతినిధులు ఉన్నట్లు తెలిసింది. రెండో రౌండ్ ముఖాముఖి చర్చల్లో ఆ బృందాలే పాల్గొంటాయా లేదా అన్న అంశంపై ఇంకా క్లారిటీ రాలేదు. అమెరికా, ఇరాన్ మధ్య చర్చల పునరుద్ధరణ జరగాలని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రస్ పిలుపునిచ్చారు. కాల్పుల విరమణ ఒప్పందాన్ని కొనసాగించాలన్నారు. కొన్ని వారాల పాటు సాగిన విధ్వంసం, విషాదం తర్వాత.. పశ్చిమాసియాలో ప్రస్తుత సంక్షోభానికి మిలిటరీ పరిష్కారం కాదని తెలిసిందన్నారు. చర్చల పునరుద్ధరణ జరిగి, ఓ ఒప్పందం కుదరాలన్నారు. అన్ని ఉల్లంఘనలు స్తంభించాలన్నారు. సంక్షోభానికి కారణమైన దేశాలన్నీ.. హోర్మూజ్ జలసంధిలో నౌకల స్వేచ్ఛ ప్రయాణానికి గౌరవం ఇవ్వాలన్నారు. అంతర్జాతీయ చట్టాల ప్రకారం ఆ ప్రక్రియ జరగాలన్నారు.

## అంబేడ్కర్‌కు ప్రధాని మోదీ నివాళి

మొదటిపేజీ తరువాయి...




కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే కూడా ప్రేరణా స్థల్ వద్ద నివాళి అర్పించారు. అయితే ఆ సమయంలో ప్రధాని మోదీతో పాటు ఖర్గే కూడా ఫోటోకు ఫోజు ఇచ్చారు. మోదీ, ఖర్గే.. ఒకరితో ఒకరు మాట్లాడుకున్నారు. మోదీ నవ్వుకుంటూ వెళ్లిపోయారు. ఉదయం తన ఎక్స్ అకౌంట్‌లో మోదీ ఓ ట్వీట్ చేశారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా నివాళి అర్పిస్తున్నట్లు పేర్కొన్నారు. జాతి నిర్మాణం కోసం ఆయన చేసిన కృషి ఎంతో ప్రేరణాత్మకంగా ఉన్నట్లు చెప్పారు. ప్రగతిశీల సమాజ నిర్మాణం కోసం ఆయన జీవితం ఎప్పుడూ అందరికీ ఆదర్శంగా ఉంటుందన్నారు.

# సంపాదకీయం

## అంబేద్కర్ ఆశయాలకు పట్టం కట్టాలి !

అంబేద్కర్ మహాశయుడు ఈ దేశం గురించి గొప్పగా కలలు కన్నారు. తన దేశాన్ని ఉన్నతంగా చూడాలను కున్నారు. అస్పృశ్యతను పూర్తిగా నిర్మూలించడంతో పాటు, అందరికీ విద్య దక్కాలన్న ఆశయం ఆయనది. న్యాయవాదిగా, ఆర్థికవేత్తగా, రాజకీయవేత్తగా, సామాజిక సంస్కర్తగా, రాజ్యాంగ నిర్మాతగా భారతీయుల గుండెల్లో ఎప్పటికీ నిలిచిపోయే మహనీయుడు డాక్టర్ భీమ్‌రావ్ అంబేద్కర్. అంటరానితనాన్ని వ్యతిరేకిస్తూ.. దళితులు, మహిళలు, కార్మికుల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేసిన యోధుడు అంబేద్కర్. దేశంలో అన్ని మతాలు, తెగలు, దళితులు, గిరిజనులు, వెనుకబడిన కులాలు తదితర వర్గాలకు సమ న్యాయం జరిగేలా, వారి హక్కులకు భంగం వాటిల్లకుండా ఉండేందుకు, సర్వసత్తాక సౌర్వభౌమాధి కారాన్ని దక్కించుకొనేందుకు వీలుగా అంబేద్కర్ రాజ్యంగాన్ని రూపొందించారు. వివిధ రకాల భాషలు, ఆచారాలు, మతాలూ ఉన్నటువంటి ఈ దేశంలో ఆయన ముందు చూపుతో రాసిన రాజ్యాంగం అనుసరించి ఇప్పుడు మన దేశం నడుస్తుంది అంటే ఆయన గొప్పతనం ఏంటో అర్థం అవుతుంది. ఆయన కేవలం దళితుల కోసమో లేక వాళ్ళ రిజర్వేషన్ ల కోసమో మాత్రమే కృషి చేయలేదు. ఆడవాళ్ళకి మగవాళ్ళకి సమానమైన జీతాలు ఉండాలని, ఆడవాళ్ళకి ప్రెగ్నెన్సీ టైం లో లీవ్స్ ఇవ్వాలని, పని గంటల సమయాన్ని 12 నుండి 8 గంటలు చేయాలనీ, స్త్రీలకూ ఆస్తి హక్కు ఇవ్వాలని ఇలా ఎన్నో అంశాలలో ఈయన కృషి చేసారు. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని యావత్ భారతావని ఆయన ఆశయాలపై ఇప్పటికైనా అధ్యయనం చేయాలి. ఎంతసేపు అంబేద్కర్ పేరు చెప్పి విగ్రహాలు పెట్టడం, సభలు పెట్టడం కాదు. ఆయన దేశానికి అందించిన విలువైన సూచనలు పాటించలి. ఆయన కోరుకున్న సమాజం కోసం పాలకులు ఆలోచన చేయాలి. అందుకు నడుం బిగించాలి. జయంతి సభల్లో ఉపన్యాసాలు ఇవ్వడం మానాలి. ఒకానొక సమయంలో అంటరానితనం పేరు తో అట్టడుగు వర్గాల ప్రజల పరిస్థితి ఏవిధంగా ఉండేదన్నది ఆయన జీవితమే పెద్ద ఉదాహరణ. అప్పటి వరకు మూగ బోయిన అణగారిన ప్రజలకు గొంతుకయ్యాడు. అయితే కొందరు రాజకీయంగా ఆయనను ఎదగకుండా చేశారు. స్వాతంత్ర్యం రాగానే నెహ్రూ బదులు అండేబ్కర్‌ను ప్రధానిని చేసివుంటే మనదేశ రాత మరోలా ఉండేది. కానీ నెహ్రూ, గాంధీల కుట్రలకు ఆయన బలయ్యారు. భారత రాజ్యాంగ నిర్మాత, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, ఆర్థిక నిపుణుడు, దళితోద్ధారకుడు, మహా మేధావి, బహుముఖ ప్రజ్ఞాశాలి, ఇలా ఆయన గురించి ఎంత చెప్పినా తక్కువే. అందుకే నేమో ఆయనను ఆనాటి నేతలు దూరం పెట్టారు. ఈనాటి నేతలు విగ్రహాలు పెట్టి, కేవలం చెక్క భజనలు చేస్తున్నారు. కానీ ఆయన స్వప్నించిన భారతాన్ని ఆవిష్కృతం చేసే ప్రయత్నాలు చేయడం లేదు. 1891 వ సంవత్సరం ఏప్రిల్ 14 వ తేదీన రాంజీ మాలోజి సక్పాల్ ,భీమాబాయ్ దంపతులకు మధ్యప్రదేశ్ లోని మావ్ గ్రామంలో మహర్ కులంలో అంబేద్కర్ జన్మించారు. అప్పట్లో ఈ కులం వారిని అంటరానివారిగా పరిగణించేవారు. దళితుడు అనే కారణంతో ఈయన చిన్న వయసు నుండే ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నారు. చిన్నప్పుడు వాళ్ళ అన్నయ్యతో కలిసి వేరే ఊరుకి నడిచి వెళ్తుంటే బాగా దాహం వేయడంతో దగ్గరలో ఉన్న ఒక ఇంటికి వెళ్లి తాగడానికి నీటిని అడిగితే అంబేద్కర్ మహర్ కులానికి చెందిన వారు అని తెలిసి నీళ్లు ఇవ్వకపోగా, పక్కనే ఉన్న మురికి గుంటలో నీటిని తాగమని తిట్టి పంపించారు. ఇది ఒక ఉదాహరణ మాత్రమే. ఇలాంటి అనేక అవమానాలను అంబేద్కర్ ఎదుర్కొన్నారు. అందుకే ఇలాంటి వ్యవస్తను నిరసించాడు. అలాగని మిగతా కులాల వారిని ఏనాడూ ఆయన ఈసడించుకోలేదు. ఇది వ్యవస్థాగతమైన లోపంగా గుర్తించారు. తన ఆలోచనలను రాజ్యాంగ రచనలో చూపారు. భారత దేశం ఉన్నతంగా ఉండాని కోరుకున్నాడు. దేశ విభజనను తీవ్రంగా వ్యతిరేకించారు. ఇదే విషయాన్ని నిర్మొహమాటంగా చెప్పారు. కానీ వారెవ్వరూ అంబేద్కర్‌ను లెక్కచేయలేదంటే, ఆయన పట్ల వారికి గల ప్రేమానురాగాలు ఏపాటివో వేరుగా చెప్పాల్సిన పనిలేదు. అమెరికాలో మొదటి సారిగా అంబేద్కర్ స్వేచ్ఛ అంటే ఏంటో చూసారు. అప్పుడు భారత దేశంలో ఉన్నట్టుగా కుల, జాతి వివక్షత లేదు. అందరికి సమానమైన గౌరవం, అవకాశాలు దక్కేవి. 1917 లో అంబేద్కర్ వెనక్కి వచ్చి ఒప్పందం ప్రకారం బరోడా సంస్థానంలో రక్షణశాఖలో ఉద్యోగంలో చేరారు.క్కడ ఆయనకి ఒక గొప్ప అధికారిగా ఉద్యోగం దక్కింది కానీ ఈయన నిమ్న కులస్తుడు కావడంతో ఆయన కింద ఉండే ఉద్యోగులు కూడా ఆయనని గౌరవించే వారు కాదు. ఏదైనా ఒక ఫైల్ ఇవ్వాలంటే దూరం నుండే ఆయన టేబుల్ మీదకు విసిరేసేవారు. చదవాలన్న, పని చేయాలన్న, ఉండడానికి ఇల్లు కావాలన్నా, చివరికి నీళ్లు తాగాలన్న కూడా కులం అడ్డు వచ్చేది. ఉద్యోగం చేసుకుంటూనే 1927 నుండి అంటరానితనానికి వ్యతిరేకంగా ఉద్యమాలు చేయడం మొదలు పెట్టాడు. ఇలా మహద్ లో దళితుల మహా సభని ఏర్పాటు చేసారు. దేశంలో నలుమూలల నుండి కొన్ని వేల మంది దళితులు ఆ సభకు హాజరయ్యారు. అప్పటివరకు దళితులు మహద్ లోని చెరువులో నీటిని తాగడానికి అనుమతి ఉండేది కాదు. కానీ అంబేద్కర్ ఆ సభలో దానికి వ్యతిరేకంగా పోరాడి ఆ చెరువులో నీటిని తాగడానికి అనుమతి వచ్చేలా చేసారు. కొల్హాపూర్ మహారాజ్ సాహు మహారాజ్ అస్పృశ్యత , అంటరానితనాన్ని నివారించడానికి కృషి చేస్తున్నారు అని తెలుసుకుని ఆయన సహకారంతో మూగ వాళ్ళకి నాయకుడు అనే అర్థం వచ్చేలా 'మూక్ నాయక్' అనే పత్రికను అలాగే బహిష్కృత్ భారత్, జనతా , ప్రబుద్ధ భారత్ అనే పత్రికలూ నడిపారు. ళితులకు బడులలోకి, గుడులలోకి వెళ్ళడానికి అనుమతి పొందేలా ఉద్యమాలు చేపట్టి విజయం సాధించారు. ఆయన అంత స్థాయికి ఎదిగారు అంటే కారణం చదువు. ఃూబట్టే ఆయన అందరికి చదువు అందాలని కృషి చేసారు. అయితే సంపద కోసమో, అధికారం కోసమో పోరాటం చేయలేదు అట్టడుగు వర్గాల స్వేచ్ఛ కోసం ఆయన పోరాడేవారు. శోధించు, సమీకరించు, పోరాడు అనే సిద్ధాంతంతో బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం, కులమాత బేధాలు లేని సమాజం కోసం కృషి చేసేవారు.స్వాతంత్రం వచ్చిన తరువాత అంబేద్కర్ కి కేంద్ర మండలిలో మొట్ట మొదటి న్యాయశాఖ మంత్రి గా పదవి వచ్చింది. అంతేకాదు భారత దేశపు రాజ్యాంగాన్ని రాసే అవకాశం దక్కింది. అయితే రాజ్యాంగం రచించడానికి నియమించిన సభ్యులలో ఒకరు రాజీనామా చేయడం, మరొకరు మరణించడం, కొంతమంది అమెరికాలో ఉండిపోవడం, మరికొంతమంది రాష్ట్ర రాజకీయాలలో నిమగ్నులవడం ఇలా రకరకాల కారణాల వలన భారత రాజ్యాంగం రచించే బాధ్యతంతా అంబేద్కర్ మీద పడింది. దాంతో ఆయన రాత్రీపగలు అనే తేడా లేకుండా నిరంతరం రాజ్యాంగ రచనలోని ఉండేవారు.

## రైలు పట్టాలపై 15 రోజుల పసికందు.. ఖైరతాబాద్‌లో కలకలం



హైదరాబాద్: హైదరాబాద్‌లో హృదయ విదారక ఘటన వెలుగులోకి వచ్చింది. ఖైరతాబాద్–లక్డీకపూల్ రైల్వే స్టేషన్ల మధ్య రైలు పట్టాలపై 15 రోజుల పసికందును వదిలేసి వెళ్లారు. అయితే ఇది గమనించిన రైల్వే సిబ్బంది వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. రైల్వే సిబ్బంది ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. పసికందును చికిత్స నిమిత్తం నిలోఫర్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం పాప ఆరోగ్యం స్థిరంగా ఉన్నట్లు తెలుస్తోంది. కాగా, ఆడపిల్ల పుట్టిందనే కారణంతోనే వదిలి వెళ్లి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

## వీకే కోల్ మైన్ లో బిఆర్ అంబేద్కర్ 135 జయంతి వేడుకలు



కొత్తగూడెం సింగరేణి (తెలంగాణ వాణి) ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణి కొత్తగూడెం ఏరియాలో గల వీకే కోల్ మైన్స్ లో రాజ్యాంగ నిర్మాత బిఆర్ అంబేద్కర్ 135 వ జయంతి వేడుకలను టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ రాష్ట్ర ముఖ్య ప్రధాన కార్యదర్శి కాపు కృష్ణ, వికె కోల్ మైన్స్ అధికారులు

అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించడం జరిగింది. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంచడం జరిగింది.. ఈ యొక్క కార్యక్రమంలో మేనేజర్ మురళి ,సేఫ్టీ ఆఫీసర్ అనిల్ గారు, ఎస్టేట్ లేజన్ ఆఫీసర్ రాందాస్ గారు,వెల్ఫేర్ ఆఫీసర్ విక్టర్, డివై ఎస్ ఈ నాజీర్,ఏఐటీయూసీ యూనియన్ నాయకులు ఎంఆర్కె ప్రసాద్, ఐఎన్ టి సి యూనియన్ నాయకులు గోపు కుమార్, విప్లవ్,టీబీజీకేఎస్ రాష్ట్ర చీఫ్ జనరల్ సెక్రెటరీ కాపుకృష్ణ, ఎస్సీ ఎస్టీ అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ నాగేశ్వరరావు,ఏరియా వైస్ ప్రెసిడెంట్ చెరుపల్లి నాగరాజు, ఎస్టీ సంఘం నాయకులు భీముడు, హీరలాల్,లక్ష్మణ్, ఎస్సీ సంఘం నాయకులు కొంకటికృష్ణ, ఉద్యోగులు హరిబాబు, లక్ష్మణ్ రావు, రాంబాబు,హరిబాబు, దుర్గ సింగ్,లక్ష్మీనారాయణ, కుమార్,రామారావు, సురేష్, శ్రీను తదితరులు పాల్గొని చిత్రపటానికి నివాళులు అర్పించడం జరిగింది.

## ఎపి సీట్ల పెంపుతో ఉత్తరాదికే మేలు దక్షిణాది ప్రభావం తగ్గడం ఖాయం సిపిఎం ఎంపి జాన్ బ్రిట్టాస్

న్యూఢిల్లీ,ఏప్రిల్14 : మహిళా రిజర్వేషన్ చట్టానికి సవరణల కోసం కేంద్రం ఏర్పాటు చేయనున్న పార్లమెంటు ప్రత్యేక సమావేశాలపై సిపిఎం ఎంపి జాన్ బ్రిట్టాస్ స్పందించారు. ఈ సవరణలతో దక్షిణ భారత దేశం కంటే ఉత్తర భారత దేశానికి ఎక్కువ ప్రయోజనం కలుగుతుందని చెప్పారు. దక్షిణాది రాష్ట్రాలకు 63 నుంచి 65 లోకసభస్థానాలు పెరిగితే, ఉత్తరాది రాష్ట్రాలకు కనిష్టంగా 200కు పైగా సీట్లు పెరుగుతాయని, దీంతో జాతీయ రాజకీయాల్లో ఉత్తరాది రాష్ట్రాల ప్రభావం గణనీయంగా పెరుగుతుందని అన్నారు. దక్షిణాది రాష్ట్రాల ప్రభావం గణనీయంగా తగ్గుతుందని చెప్పారు. లోక్‌సభ సీట్లను 543 నుంచి 816 స్థానాలకు పెంచే లక్ష్యంతో రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెట్టడానికి ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలను కేంద్రం ఏర్పాటు చేయనున్న సంగతి తెలిసిందే. ఈ విషయంలో ముందునుంచి తమిళనాడు, కేరళ, తెలంగాణ రాష్ట్రాలు నిరసిస్తున్నాయి. దక్షిణాదిపై కుట్రగా అభివర్ణిస్తున్నాయి.

# దేశం గర్వించదగ్గ మేధావి అంబేద్కర్

### జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



నిర్మల్, ఏప్రిల్:14(తెలంగాణ వాణి ప్రతినిధి): భారత రాజ్యాంగ రూపకర్త, భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పిలుపునిచ్చారు. మంగళవారం అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని నిర్మల్ పట్టణంలోని మినీ ట్యాంక్ బండ్ సమీపంలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి ఆమె పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు పంచశీల జెండాను ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. అంబేద్కర్ ప్రపంచం గర్వించదగ్గ గొప్ప మేధావి అని కొనియాడారు. బడుగు, బలహీన వర్గాలు వివక్షకు గురవుతున్న కాలంలో, సమసమాజ స్థాపనే లక్ష్యంగా ఆయన అహర్నిశలు శ్రమించారని గుర్తుచేశారు. చిన్నతనం నుంచే ఎన్నో కష్టాలను ఎదుర్కొని, ఉన్నత విద్యను అభ్యసించి, దేశానికి పటిష్టమైన రాజ్యాంగాన్ని అందించిన మహనీయుడని ప్రశంసించారు. ఆయన అడుగుజాడల్లో నడుస్తూ, సమాజంలోని అన్ని వర్గాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా మెలగాలని సూచించారు. అనంతరం జయంతి వేడుకల్లో భాగంగా ప్రత్యేకంగా 'అరైవ్ అలైవ్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా కలెక్టర్ అధికారులతో కలిసి రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి, శ్రీ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఎస్సీ సంక్షేమ శాఖాధికారి దయానంద్, సీపీఓ జీవరత్నం, డి ఈ ఓ భోజన్న, వివిధ సంఘాల నాయకులు, కుంటోళ్ళ వెంకట స్వామి,సత్యనారాయణ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ, జయంతి వేడుకలు

హుస్నాబాద్ ఏప్రిల్ 14 (తెలంగాణ వాణి ఆర్ సి): సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండల కేంద్రంలో బీజేపీ పార్టీ అధ్యక్షుడు రామంచ మహేందర్ రెడ్డి అధ్యక్షతన డాక్టర్ భారతరత్న బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి పురస్కరించుకొని వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అక్కనపేట మండల అధ్యక్షులు మహేందర్ రెడ్డి మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాతగా, అట్టడుగు వర్గాల ఆశాజ్యోతిగా దేశ గమనాన్ని మార్చిన అంబేద్కర్ విజ్ఞానానికి, పోరాటానికి నిలువెత్తు రూపంఅని అన్నారు.సమాజంలోని అసమానతలను రూపుమాపి, ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు కల్పించేందుకు ఆయన చేసిన కృషి చిరస్మరణీయని, అంబేద్కర్ ఆశయాలను గౌరవిస్తూ, అట్టడుగు వర్గాలకు అభివృద్ధి ఫలాలను అందిస్తూ నవ భారత నిర్మాణానికి నరేంద్ర మోదీ ప్రభుత్వం అంకిత భావంతో పని చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు



జిల్లా కౌన్సిల్ మెంబర్ కర్ణకంటి నరేష్ మండల ప్రధాన కార్యదర్శులు చెరుకు సంపత్ మడక రవికుమార్ చౌడు తండా ఉపసర్పంచ్ అర్జున్ నాయక్ బిజెపి సీనియర్ నాయకులు మోహన్ నాయక్ జంగపల్లి శ్రీనివాస్ చందుపట్ల నాగరాజు. తీగుల చంద్రం కొండ్ల సంజీవరెడ్డి జన్నారపు కళ్యాణ్. బత్తిని జీవన్, గిరిమల్ల రాజు,ఇటీకాల రాజశేఖర్, వేముల శ్రీనివాస్,రాజు,తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

# నేటి తరానికి స్ఫూర్తి దాయకం అంబేద్కర్ జీవితం



మొగుళ్ళపల్లి (తెలంగాణ వాణి) మండల కేంద్రంలో అంబేద్కర్ యువజన సంఘం గ్రామ శాఖ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ రచయిత ప్రపంచ మేధావి డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిఐ మల్లేష్ యాదవ్, ఎస్ఐ ఎం సురేష్ మాట్లాడుతూ దేశ ప్రజల జీవితాల్లో వెలుగు నింపి దేశ చరిత్రను తిరగరాసిన మహోన్నత వ్యక్తి సంఘసంస్కర్త అంటరాని తనం అస్పృశ్యత కుల వివక్ష నిర్మూలన కోసం అలుపెరగని పోరాటం చేసిన మహనీయుడు భారత రాజ్యాంగ రచయిత ప్రపంచ మేధావి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చాట్ల విజయ– రవీందర్ చిట్యాల మార్కెట్ వైస్ చైర్మన్ రఫీ, పిఎసిఎస్ చైర్మన్ మాజీ సంపెల్లి నరసింగరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు తక్కలపల్లి రాజు, భారతీయ జనతా పార్టీ భూపాలపల్లి నియోజకవర్గ ఇన్చార్జి మోరే రవీందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి నడిగోటి రాము, దళిత రత్న దబ్బేటి రమేష్, అంబేద్కర్ యువజన సంఘం



జిల్లా నాయకులు మంద సాంబయ్య, హర్షం అశోక్, ఎంపీ ఓ చంద్ర బోస్, పంచాయతీ కార్యదర్శి నరేష్, మాజీ సర్పంచ్ ధర్మారావు, బండారి ప్రవీణ్ కుమార్ ఎంపీడీవో,అంబేద్కర్ యువజన సంఘం జిల్లా నాయకులు బండారి రాజు, బండారి రామస్వామి బండారి విజయ్ కుమార్, బండారి రవీందర్,,మండల నాయకులు మండల అధికారులు అంబేద్కర్ యువజన సంఘం, గుడిమల్ల రమేష్, దొమ్మేటి రవి, హర్ష మహేష్, వార్డు నెంబర్, శనిగరపు శ్రీనివాస్ మాజీ వార్డు నెంబర్,బండారి శంకర్, బండారి కుమార్ ( ధోని) బండారి సదా రాజు, బండారి సదయ్య, బండారి, సామి సార్, శనిగరపు రవికుమార్, బండారి రమేష్,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల ప్రయోజనాల దృష్ట్యా సమ్మె పై నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

### ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది మంత్రి పొన్నం ప్రభాకర్



హుస్నాబాద్ ఏప్రిల్ 14 (తెలంగాణ వాణి ఆర్ సి): ఆర్టీసీ కార్మికులు సమ్మె నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలనీ ఉద్యోగుల సమస్యలను సామరస్యపూర్వకంగా చర్చల ద్వారా పరిష్కరించడానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉందని రాష్ట్ర రవాణా,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. వారు మాట్లాడుతూ ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం కార్మిక సంఘాలకు సంబంధించిన అంశాలు ప్రభుత్వ పరిధిలో ఉన్నాయని, ఈ రెండు అంశాలు తప్ప మిగతా ఉద్యోగుల సమస్యలపై చర్చించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఉద్యోగుల సమస్యలు వినేందుకు ఎల్లవేళలా తమ తలుపులు తెరిచి ఉంటాయని మంత్రి స్పష్టం చేశారు.ఇటీవలే ఆర్టీసీ ఉద్యోగులకు 2.1 శాతం డీఏ అమలులోకి తీసుకు వచ్చామని, ప్రస్తుతం ఎలాంటి డీఏ బకాయిలు లేవని తెలిపారు.ఆర్టీసీ ఉద్యోగులకు పీఆర్సీ అంశం కూడా ఆలోచిస్తున్నామని పేర్కొన్నారు. ఉద్యోగుల సంక్షేమం పట్ల ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రకటించారు.ఆర్టీసీ ఉద్యోగుల విలీనంపై గత ప్రభుత్వం 9 సెప్టెంబర్ 2023న కమిటీ ఏర్పాటు చేసిందని ఎన్నికల షెడ్యూల్ కు 10 రోజులకు ముందు హడావిడిగా విలీనం అంశాన్ని ముందుకు తీసుకువచ్చారని గుర్తుచేశారు.గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీలో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి చైర్మన్‌గా, కార్మిక శాఖ ముఖ్య కార్యదర్శి, జీఏడి సెక్రటరీ, రోడ్డు రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి, ఆర్టీసీ ఎండీ సభ్యులుగా ఉన్నారని తెలిపారు.కమిటీ ఏర్పాటు అయిన 10 రోజుల్లోనే అక్టోబర్ 10, 2023న ఎన్నికల షెడ్యూల్ విడుదలై, నవంబర్ 30న ఎన్నికలు జరిగి, డిసెంబర్ 3న ఫలితాలు వచ్చాయని చెప్పారు. డిసెంబర్ 7, 2023న ప్రజా పాలన ప్రభుత్వం ఏర్పడినప్పటికీ ప్రభుత్వం పూర్తి స్థాయిలో కుదురుకొక ముందే, మార్చ్ 16, 2024న లోకసభ ఎన్నికల షెడ్యూల్ రావడంతో జూన్ 6 వరకు సుదీర్ఘంగా ఎన్నికల కోడ్ అమలులో ఉందని వివరించారు. తమ ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లోనే మహిళలకు మహా లక్ష్మీ పథకం కింద ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించి, ఆర్టీసీ సేవలను బలోపేతం చేసినట్లు మంత్రి తెలిపారు. ఒకప్పుడు ఉనికికే ప్రశ్నార్థకంగా ఉన్న ఆర్టీసీ, ప్రస్తుతం 90కి పైగా డిపోలు లాభాల్లో నడుస్తున్నాయని వెల్లడించారు.

ఆర్టీసీ సంస్థ పరిరక్షణ, ఉద్యోగుల సంక్షేమం, ప్రయాణికుల సౌలభ్యం ఈ మూడు అంశాలకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని మంత్రి పేర్కొన్నారు. ఉద్యోగుల ప్రభుత్వ విలీనంపై సంస్థ, ఉద్యోగుల అంశాలు ప్రభుత్వ ఆర్థిక పరిస్థితులపై కమిటీ సమగ్ర అధ్యయనం అవసరమని చెప్పారు. ప్రస్తుతం ఆర్టీసీ క్రమంగా కోలుకుంటున్న సమయంలో సమ్మె నిర్ణయం సరైంది కాదని, ఇది సంస్థకు, ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తుందని విజ్ఞప్తి చేశారు.ప్రజా పాలన ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మీ పథకం ద్వారా ఆర్టీసీకి అనేక సంస్కరణలు తీసుకొచ్చినట్లు మంత్రి తెలిపారు. గతంలో రూ.1205 కోట్లుగా ఉన్న పీఎఫ్ బకాయిలను రూ.600 కోట్లకు తగ్గించామని, రూ.690 కోట్లుగా ఉన్న జజూ బకాయిలను రూ.300 కోట్లకు తగ్గించామని చెప్పారు.ఇప్పటి వరకు 2978 కొత్త బస్సులను ప్రవేశపెట్టడంతో పాటు, 1134 మందికి కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలు కల్పించామని తెలిపారు. కొత్త ఉద్యోగ నియామకాలకు సంబంధించిన పరీక్షలు పూర్తయ్యాయని, త్వరలోనే వారు విధుల్లోకి రానున్నారని పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో ఆర్టీసీ ఉద్యోగులు సమ్మె నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని, చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు.

# చమురు మంటలు తప్పవా..



## హెర్ముజ్ దిగ్బంధంతో ఇంధన సంక్షోభం తీవ్రతరం

న్యూఢిల్లీ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెర్ముజ్ జలసంధిపై నావికా దిగ్బంధానికి ఆదేశించడంతో పశ్చిమాసియాలో యుద్ధానికి త్వరితగతిన ముగింపు లభించగలదన్న ఆశలు సన్నగిల్లాయి. ఇరాన్‌తో ప్రతిష్టంభన కారణంగా ఇప్పటికే చరిత్రలోనే అ్యతంత తీవ్రమైన ఇంధన సంక్షోభం ఏర్పడింది. ఇరాన్, అరేబియా గల్ఫ్, ఒమన్ గల్ఫ్ సహా ఓడరేవులు, తీరప్రాంతాల్లోకి ప్రవేశించే లేదా బయలుదేరే అన్ని దేశాల నౌకలను లక్ష్యంగా చేసుకుని ఈ దిగ్బంధం సోమవారం ఉదయం 10 గంటలకు(ఈస్టర్న్ టైమ్) అమల్లోకి వస్తుందని అమెరికా సెంట్రల్ కమాండ్ ఒక ప్రకటనలో తెలిపింది. ట్రంప్ గత వారం ప్రకటించిన రెండు వారాల కాల్పుల విరమణ ప్రకటనతో హెర్ముజ్ జలసంధి గుండా స్వల్పంగా పెరిగిన ట్యాంకర్ ట్రాఫిక్ ట్రంప్ తాజా ప్రకటనతో మళ్లీ నిలిచిపోయినట్లు లాయిడ్స్ లిస్ట్ ఇంటెలిజెన్స్ తెలిపింది. జలసంధి గుండా వెలుపలకు నిష్క్రమించడానికి వెళుతున్న రెండు నౌకలు మళ్లీ వెనుదిరిగినట్లు తెలుస్తున్నది. ఈ క్రమంలో ముడిచమురు ధరలు ఒక్కసారిగా పెరిగాయి. బ్రెంట్ ముడిచమురు 7 శాతం పెరిగి 101.86 డాలర్లకు చేరింది.

**ముదిరిన చమురు సంక్షోభం:** ఫిబ్రవరి 28న ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ జరిపిన తొలి దాడులకు ముందు ప్రపంచ చమురులో సుమారు ఐదో వంతు హెర్ముజ్ జలసంధి గుండా రవాణా అయ్యేది. అప్పటి నుంచి ఆ ప్రవాహం చాలావరకు తగ్గిపోయి, చమురు, ఎరువులు, దుస్తులు, పారిశ్రామిక వస్తువుల సరఫరా గొలుసులను తలకిందులు చేసింది. ఈ యుద్ధానికి పరిష్కారం లభించినప్పటికీ పేరుకుపోయిన ఆర్డర్లను పూర్తి చేయడానికి వారాలు పట్టవచ్చని నిపుణులు హెచ్చరించారు. పూర్తి దిగ్బంధం వల్ల సంక్షోభం మరింత ముదురుతుంది. ఇప్పుడు పర్షియన్ గల్ఫ్ నుంచి బయటకు వస్తున్న ఏకైక చమురును మార్కెట్ నుంచి తొలగిస్తే చమురు ధర బ్యారెల్‌కు సుమారు 150 డాలర్లకు చేరే అవకాశం ఉందని రెస్పాన్సిబుల్ స్టేట్ క్రాఫ్ట్ వైస్ ప్రెసిడెంట్ ట్రీటా పార్సీ తెలిపారు. ముడిచమురుతోపాటు ఆహార ఉత్పత్తి, సెమీకండక్టర్ తయారీకి కీలకమైన ముడి పదార్థాలైన ఎరువులు, హీలియం వంటి వస్తువుల ధరలు కూడా మరింత పెరిగే అవకాశం ఉందని, ఇది ద్రవ్యోల్బణాన్ని మరింత పెంచుతుందని ఫెడ్ వాచ్ అడ్వైజర్స్ మేనేజింగ్ డైరెక్టర్ బెన్ ఎమోన్స్ తెలిపారు.

**చైనాపై తీవ్ర ప్రభావం:** ఈ దిగ్బంధం ప్రపంచంలోని రెండవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థను కూడా ఈ యుద్ధంలోకి లాగే ప్రమాదం ఉంది. చైనా ఇప్పటికీ ఇరాన్‌కు అతిపెద్ద చమురు కొనుగోలుదారుగా ఉంది. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఈ జలసంధి ద్వారా రవాణాను స్వీకరిస్తూనే ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. ఇరాన్ నుంచి చమురును తీసుకువెళ్లే ట్యాంకర్లపై పూర్తిస్థాయి నిషేధం ఆ సరఫరాను నిలిపివేసే ప్రమాదం ఉంది. ఇది వచ్చే నెలలో ట్రంప్ చైనా పర్యటనకు ముందు బీజింగ్‌తో అమెరికా ఉద్రిక్తతలను మళ్లీ రాజేసే అవకాశం ఉంది. ట్రంప్ మళ్లీ ఉద్రిక్తతల పెంపునకు సిద్ధపడతారా అన్నది అనుమానాస్పదమేనని పార్సీ చెప్పారు. ఇరాన్‌తో సురక్షిత మార్గాల ఒప్పందాలు కుదుర్చుకున్న భారత్, పాకిస్థాన్ వంటి దేశాలు కూడా ఈ ఘర్షణలో చిక్కుకునే ప్రమాదం ఉందని ఆయన అన్నారు. అయితే ఈ దిగ్బంధాన్ని పరిస్థితిని తీవ్రతరం చేసే అంతిమ చర్యగా కాకుండా ఒక బలవంతపు ఒత్తిడిగా విశ్లేషకులు భావిస్తున్నారు. చర్చలు మళ్లీ ప్రారంభం కావని లేదా కాల్పుల విరమణ ముగిసిందని ఇరుపక్షాలు స్పష్టంగా చెప్పనందున ఈ చర్యలన్నిటినీ చర్చల్లోని ఎత్తుగడలు, బెదిరింపులుగానే పరిగణించాలి అని పార్సీ అన్నారు.

**చట్టబద్ధత లేదు:** ఈ దిగ్బంధం చట్టపరంగా కూడా వివాదాస్పదమైనట్లు నిపుణులు అభిప్రాయపడుతున్నారు. హెర్ముజ్ గుండా నౌకల రాకపోకలను మూసివేయడానికి లేదా అడ్డుకోవడానికి అమెరికాకు, ఇరాన్‌కు అధికారం లేదని వారు పేర్కొన్నారు. హెర్ముజ్ జలసంధికి ఇరాన్, ఒమన్ మాత్రమే తీరప్రాంత దేశాలని, వాటికి కూడా రవాణా మార్గాలను నిలిపివేయడం నిషిద్ధమని వారు పేర్కొన్నారు.

## అమ్మా లే.. నాన్నా లే!



తాండూరు: వికారాబాద్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వేగంగా దూసు కొచ్చిన లారీ స్కూటీని ఢీకొట్టడంతో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. తాండూరు రూరల్ సీఐ ప్రవీణ్‌కుమా ర్‌రెడ్డి, బంధువుల కథనం ప్రకారం.. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణం శాంతి నగర్‌కు చెందిన జాల్ల కవికుమార్ (40), పావని (35) దంపతులు. వారికి కార్తీక్, కీర్తన (9) పిల్లలు ఉన్నారు. మే ఒకటి న పావని సోదరుడు రాజ్‌కుమార్‌కు పెళ్లి నిశ్చయ మైంది.

దీంతో సంప్రదాయం ప్రకారం ఆడపడుచు పుట్టింటి గడపకు పసుపు పూసి బొట్టు పెట్టి పూజలు చేయాలి. అందుకోసం పావని భర్త, పిల్లలతో కలిసి స్కూటీపై మధ్యాహ్నం జిల్లాలోని పెద్దే ముల్ మండలం రుక్మాపూర్‌కు వచ్చింది. పుట్టింట్లో కార్యక్రమం ముగించుకొని సోమవారం ఉదయం 5:15 గంటలకు జహీరాబాద్‌కు తిరిగి స్కూటీపై కుటుంబమంతా బయలుదేరింది. పెద్దేముల్ మండలం తట్టేపల్లి వద్దకు రాగానే జహీరాబాద్ నుంచి వస్తున్న లారీ వీరి స్కూటీని ఢీకొట్టింది. దీంతో కవికుమార్, పావని లారీ చక్రాల కింద నలిగి అక్కడికక్కడే మృతిచెందగా కీర్తన రోడ్డుపై పడటంతో మృతిచెందింది. కార్తీక్ మాత్రం ఈ ప్రమాదం నుంచి గాయాలతో బయటపడ్డాడు. కళ్ల ముందే తల్లిదండ్రులు, చెల్లెలు మృతిచెందడంతో కార్తీక్ వారి మృతదేహాల వద్ద విలపిస్తూ అమ్మానాన్న లను లేవాలంటూ బతిమిలాడటం చూపరు లను కంటతడి పెట్టించింది. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ మహమ్మద్ షరీఫ్ పెద్దేముల్ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోగా అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు డీఎస్పీ నర్సింగ్ యాదయ్య తెలిపారు. బాలుడిని హైదరాబాద్‌కు తరలించి మెరుగైన వైద్యం అందిస్తున్నారు.

## భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు
# ఎలక్ట్రిక్ బస్సులు

### సర్వే చేస్తున్న ఏపీఎస్ఆర్టీసీ అధికారులు
### ముందు 20 నుంచి 30 బస్సులు నడిపేలా




అమరావతి,: విజయనగరం జిల్లా భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ త్వరలో ప్రారంభానికి సిద్ధమవుతోంది. అన్ని కుదిరితే జులై కానీ ఆగస్టులో కానీ ప్రారంభించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ ఎయిర్‌పోర్ట్ త్వరలో అందుబాటులోకి రానుండటంతో.. ఆర్టీసీ ముందుగానే ప్రణాళికలు రూపొందించి ప్రజా రవాణాకు సిద్ధమవుతోంది. ప్రయాణికులు విమానాశ్రయానికి చేరుకునేందుకు విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి ఏసీ విద్యుత్తు బస్సులు నడపాలని ఆలోచన చేస్తోంది. ఏపీఎస్ఆర్టీసీ రీజినల్, జోనల్ మేనేజర్లు క్షేత్రస్థాయిలో బస్సు సర్వీసుల అంశంపై ఓ సర్వే నిర్వహిస్తున్నారు. ప్రయాణికుల రద్దీని అంచనా వేసేందుకు ఈ సర్వే చేస్తున్నారు ఆర్టీసీ అధికారులు. ముందుగా 20 నుంచి 30 వరకు బస్సులు తిప్పాలని.. ఆ తర్వాత పరిస్థితిని బట్టి బస్సుల సంఖ్యను పెంచడంపై ఫోకస్ పెట్టాలని భావిస్తున్నారు. ప్రధానంగా ఉత్తరాంధ్ర నుంచి బస్సు సర్వీసులు ఏర్పాటు చేయాలని ఎయిర్‌లైన్స్ సంస్థ నుంచి కూడా ప్రతిపాదనలు వచ్చినట్లు తెలుస్తోంది. విశాఖపట్నం నుంచి 20 ఎలక్ట్రిక్ బస్సులు కోరారని.. మిగిలిన జిల్లాల నుంచి బస్సులు అందుబాటులోకి వచ్చేలా ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. మరోవైపు రుషికొండ ఐటీ సెజ్, భోగాపురం వరకు మెట్రో సేవల్ని పొడిగించాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కోరుతున్నారు. విశాఖపట్నంలో మెట్రో ఎండీ రామకృష్ణారెడ్డిని కలిసి మెట్రో గురించి చర్చించారు. కొమ్మాది వరకు ప్రతిపాదించిన మెట్రోను భోగాపురం వరకు పొడిగిస్తే ఎయిర్ పోర్టుకు వెళ్లే ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుందన్నారు. రుషికొండలో దిగ్గజ ఐటీ సంస్థలు ఏర్పాటవుతున్నాయని.. మెట్రో రైల్‌ను ఆ ప్రాంతం వరకు పొడిగిస్తే బావుంటుందని ప్రస్తావించారు. మరోవైపు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి ముహూర్తం ఫిక్స్ చేయనున్నారు. ఈ ఎయిర్‌పోర్ట్‌ను ప్రారంభించేందుకు ప్రధాని మోదీని ఆహ్వానించాలని భావిస్తున్నారు. అందుకే ఓ నాలుగు తేదీలను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. జులై 5, 8 లేదా ఆగస్టు 17, 19వ తేదీల్లో ఒక రోజు ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రధాని మోదీని సమయం ఇవ్వాని కోరినట్లు సమాచారం. మొత్తం 98శాతం పనులు పూర్తికాగా.. జూన్ నెలాఖరు నాటికి పనులన్నీ పూర్తవువతాయంటన్నారు.

# 14 ఏళ్ల నాటి కల..

కరీంనగర్, : రాజకీయాల్లో ఏ వ్యూహం ఎప్పుడు పారుతుందో.. ఏ స్కెచ్ ఎప్పుడు ఫలిస్తుందో ఎవరూ ఊహించలేరు. ప్రత్యర్థి పార్టీని నామరూపాలు లేకుండా చేయాలనే పంతం పన్నెండేళ్ల తర్వాత ఇప్పుడు కార్యరూపం దాల్చడం చూస్తుంటే రాజకీయ చదరంగం ఎంత చిత్రంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన కొత్తలో కాంగ్రెస్‌ను ఖాళీ చేయాలని కేసీఆర్ వేసిన ప్లాన్ చేశారు. ఇన్నాళ్లకు 'జగిత్యాల టైగర్' జీవన్ రెడ్డి రూపంలో సక్సెస్ అయింది. అప్పట్లో తృటిలో తప్పిన ఈ ఫిరాయింపు, ఇప్పుడు రేవంత్ రెడ్డి మార్క్ రాజకీయాల పుణ్యమా అని సాధ్యపడింది. రాజకీయాల్లో ఫిరాయింపులు కొత్త కాదు కానీ, పన్నెండేళ్ల క్రితం వేసిన స్కెచ్ ఇప్పుడు ఫలించడం విశేషం. 2014లో కేసీఆర్ అధికారంలోకి వచ్చిన కొత్తలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలందరినీ టీఆర్ఎస్ (ఇప్పుడు బీఆర్ఎస్) కలిపేసుకోవాలని గట్టి ప్రయత్నం చేశారు. ఆ సమయంలోనే జీవన్ రెడ్డికి గులాబీ గూటి నుంచి ఆహ్వానం అందింది. అయితే ఈ విషయాన్ని తాజాగా జరిగిన ప్రెస్ మీట్‌లో జీవన్ రెడ్డి స్వయంగా బయటపెట్టారు.

అటు కేటీఆర్ కూడా 'ఆయన 2014లోనే మా పార్టీలోకి రావాల్సింది, అది ఇప్పటికి కుదిరింది' అని వ్యాఖ్యానించడం ద్వారా నాటి స్కెచ్‌ను పరోక్షంగా ఒప్పుకున్నట్లు అయ్యింది. జగిత్యాల పంచాయతీ జీవన్ రెడ్డి మనస్థాపానికి ప్రధాన కారణం తన రాజకీయ ప్రత్యర్థి సంజయ్ కుమార్ కాంగ్రెస్‌లో చేరడమే. రెండు ఎన్నికల్లో తనను ఓడించిన వ్యక్తిని రేవంత్ రెడ్డి సాదరంగా ఆహ్వానించడాన్ని జీవన్ రెడ్డి తట్టుకోలేకపోయారు. మొన్నటి మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ రెండు వర్గాలుగా విడిపోవడం, మెజారిటీ కౌన్సిలర్లు సంజయ్ వర్గం వైపు ఉండడంతో జీవన్ రెడ్డికి సొంత గడ్డపైనే భంగపాటు జరిగింది. మున్సిపల్ చైర్మన్ పీఠం దక్కకపోవడంతో తన రాజకీయ భవిష్యత్తుపై ఆయన ఒక నిర్ణయానికి వచ్చారు. ఎంతో కాలం నిరీక్షించిన జీవన్ రెడ్డి రేవంత్ రెడ్డి నాయకత్వంపై యుద్ధం ప్రకటించారు. ముఖ్యమంత్రిని గద్దె దించడమే లక్ష్యమని చెబుతూ బీఆర్ఎస్ లో కలిసిపోయారు. ఒకప్పుడు కాంగ్రెస్ అంటేనే జీవన్ రెడ్డి అన్నట్లుగా జగిత్యాల రాజకీయం సాగేది, కానీ ఇప్పుడు అదే పార్టీని ఓడించడానికి ఆయన కేంకార్ వేస్తున్నారు.

అయితే, ఫిరాయింపులను వ్యతిరేకించే బీఆర్ఎస్, ఇప్పుడు ఒక కాంగ్రెస్ సీనియర్ నేతను చేర్చుకుంటూ పాత స్కెచ్‌లను గొప్పగా చెప్పుకోవడం రాజకీయ విడ్డూరమనే చెప్పాలి. ప్రస్తుతం కాంగ్రెస్ చేస్తున్న ఫిరాయింపులు అనైతికం అంటూ బీఆర్ఎస్ విమర్శలు గుప్పిస్తూనే 2014లో జరిగిన విషయాన్ని కేటీఆర్ బయటపెట్టారు. జీవన్ రెడ్డి చేరిక సందర్భంగా కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు పాత అనైతిక రాజకీయాలను గుర్తు చేస్తున్నాయి. 'అప్పుడే ఆయన రావాల్సింది' అని అనడం ద్వారా, నాడు తాము కూడా కాంగ్రెస్‌ను ఖాళీ చేసే కుట్రలు చేశామని కేటీఆర్ అంగీకరించినట్లయ్యింది. ప్రత్యర్థిపై విమర్శలు చేసే క్రమంలో తమ పాత వ్యూహాలే ఇప్పుడు తమకు అస్త్రాలుగా మారడం విశేషం. పుష్కరం కిందట కేసీఆర్ వేసిన విత్తనం ఇప్పుడు చెట్టయ్యింది. జీవన్ రెడ్డి చేరికతో జగిత్యాల రీజియన్‌లో బీఆర్ఎస్ కు కొత్త బలం చేకూరవచ్చు కానీ, ఇది సిద్ధాంతాల పరంగా ఆ పార్టీకి ఒక పరీక్షే. ఫిరాయింపుల రాజకీయాలను ఇరు పక్షాలు తప్పుబడుతున్నా, చివరికి అవే మార్గాల్లో ప్రయాణిస్తున్నాయి. 2014లో కేసీఆర్ వేసిన స్కెచ్ ఇన్నాళ్లకు వర్కవుట్ అయింది సరే.. మరి దీనివల్ల జీవన్ రెడ్డికి, బీఆర్ఎస్ కు కలిగే అసలు ప్రయోజనం ఏంటో రాబోయే కాలమే తేల్చాలి.

## బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్



### ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పటాన్ చెరు లో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు

పటాన్ చెరు, ఏప్రిల్ 14, (తెలంగాణ వాణి రిపోర్టర్): దేశం లోని బడుగు బలహీన వర్గాలకు సమాన హక్కులు సాధించడంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చేసిన కృషి మరువ లేనిదని, ఆయన జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శ ప్రాయమని పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి పురస్కరించు కొని మంగళవారం పటాన్ చెరు పట్టణంలోని అంబేద్కర్ కాంస్య విగ్రహానికి, బ్లాక్ ఆఫీస్ ప్రాంగణం లోని అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే జిఎంఆర్ పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో అసమానతలు రూపుమాపి అందరికీ సమ న్యాయం అందించిన మహోన్నత వ్యక్తి అంబేద్కర్ అని కొనియాడారు. చిన్న రాష్ట్రాల ద్వారానే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందన్న అంబేద్కర్ ఆలోచనలకు అనుగుణంగానే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయిందని తెలిపారు. నేటి తరం యువత అంబేద్కర్ ఆశయాలు కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో యాదగిరి, మాజీ కార్పొరేటర్లు సపాన దేవ్, మెట్టు కుమార్ యాదవ్, గూడెం మధుసూదన్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, రుద్రారం శంకర్, వెంకటేష్, నర్రా బిక్షపతి, శ్రీధర్ చారి, అశోక్, అఫ్జల్, రాములు, మాదిరి పృథ్వీరాజ్, వివిధ దళిత సంఘాల ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

## వైసీపీలో మారుతున్న సామాజిక లెక్కలు




విజయవాడ, : వైఎస్సార్ పార్టీ.. ఏపీలో విపక్షం. మాజీ సీఎం వైఎస్సార్ తనయుడిగా రాజకీయాల్లోకి అడుగుపెట్టి, ఆ తర్వాత ఉమ్మడి రాష్ట్ర విభజన, కాంగ్రెస్ వైఖరితో విభేదించి కొత్తపార్టీ పెట్టిన రాజకీయ అసాధ్యుడు. ఐదేళ్ల విపక్ష బాధ్యతల తర్వాత 2019లో అధికారాన్ని సైతం సాధించి, సీఎంగా పాలన సాగించారు. పరిపాలన సమయంలో తీసుకున్న కొన్ని నిర్ణయాలకు ప్రజామోదం లేకపోవడం, అదే సమయంలో చంద్రబాబు, లోకేష్ అలుపెరగక చేపట్టిన ప్రచారంతో.. వైసీపీ ఘోరంగా ఓటమి పాలైంది.

బేసిగ్గా చూస్తే.. జగన్ అధికారంలో ఉన్నప్పుడు వైసీపీలో ఎక్కువ పదవులు రెడ్డి సామాజిక వర్గానికే దక్కాయి. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఆయా సామాజిక వర్గం నేతలు.. రాజకీయాల్లో హడావుడి చేసేవారు. వారు కోటరీ కట్టి జగన్ కు కళ్లు, చెవులుగా వ్యవహరించారన్న విమర్శలు ఉన్నాయి. అలాంటి నేతలు పవర్ పోవడం, లోకేష్ రెడ్ బుక్ లాంటి పరిణామాలతో కాస్త సైలెంట్ అయ్యారు. వారిస్థానాల్లో ఇప్పుడు బీసీ, ఎస్సీ ఎస్టీ నేతలు .. ముందుండి పార్టీ కార్యక్రమాలను నడుపుతున్నారు. బొత్స సత్యనారాయణ శాసనమండలిలో ప్రతిపక్ష నేతగా చురుకుగా వ్యవహరిస్తుండగా, అంబటి రాంబాబు, పేర్ని నాని పార్టీ స్వరంగా నిలుస్తున్నారు. జోగి రమేష్ కూడా బెయిల్‌పై విడుదలైన తర్వాత తన స్వరాన్ని మరింత పెంచారు. పార్టీ కార్యక్రమాలు, మీడియా సమావేశాల్లో వీరే ముందుండటం స్పష్టంగా కనిపిస్తోంది. ఈ పరిణామాలన్నింటినీ పరిశీలిస్తే? వైసీపీలో సామాజిక సమీకరణాలు కొత్త దిశగా మారుతున్నాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కష్టకాలంలో బీసీ, ఎస్సీ వర్గాలకు చెందిన నేతలు ముందుకు వచ్చి పార్టీని నిలబెట్టే ప్రయత్నం చేస్తున్నారని, అదే సమయంలో జగన్‌కు సమీపంగా ఉన్న నేతలు వ్యూహాత్మకంగా దూరంగా ఉంటున్నారనే చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. ఇదే నేతలు ఒక వేళ జగన్రాజకీయంగా పుంజుకుంటే మళ్లీ ఆయన పక్కకు చేరతారని, కోటరీ కడతారనే వాదనలు వినిపిస్తున్నాయి.

గతంలో జగన్ అధికారంలోకి రాగానే తన సామాజిక వర్గానికి చెందిన వారికి ముఖ్యమైన మంత్రి పదవులను అప్పగించారు. జగన్ హయాంలో దాదాపు 24 మంది ప్రభుత్వ సలహాదారులలో 17 మంది రెడ్డి సామాజిక వర్గానికి చెందినవారే ఉండటం అప్పట్లో రాజకీయంగా చర్చనీయాంశమైంది. ఇప్పుడు అదే నేతలు మౌనంగా ఉండడానికి కారణం ఏమిటనే చర్చ సాగుతోంది.

# యువ గుండెను కాపాడుకుందాం



నిన్న మొన్నటి వరకు వృద్ధులకే పరిమితమైన గుండెపోటు సమస్య నేడు యువతకు గండంలా దాపురించింది. దీనికి ప్రధాన కారణం మన జీవనశైలిలో వచ్చిన మార్పులే. గుండె పదిలంగా ఉండాలంటే.. యుక్త వయసు నుంచే తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

ప్లాస్టిక్‌కు దూరంగా: మనం వాడే ప్లాస్టిక్ కేవలం పర్యావరణానికే కాదు మన గుండెకుకూడా శత్రువే. ప్లాస్టిక్ కణాలు విచ్ఛిన్నమై మైక్రో ప్లాస్టిక్స్, నానో ప్లాస్టిక్స్‌గా మారి మనం పీల్చే గాలిలో, తాగే నీటిలో చేరుతున్నాయి. ఇవి శరీరంలో చేరి దీర్ఘకాలిక వాపు కలిగిస్తాయి. దీనివల్ల ధమనుల్లో అడ్డంకులు ఏర్పడి గుండెపోటు వచ్చే ప్రమాదం ఉంది. వీలైనంత వరకు ప్లాస్టిక్ బాటిళ్లు, డబ్బాల వాడకాన్ని తగ్గించాలి.

సీఫుడ్ తీసుకోండి: గుండె ఆరోగ్యానికి ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ ఎంతో అవసరం. ఇవి చేపల్లో పుష్కలంగా లభిస్తాయి. రక్తంలో ఒమేగా-3 స్థాయిలు ఎకువగా ఉన్నవారిలో గుండె సంబంధిత సమస్యలు తకువగా ఉంటాయని అధ్యయనాలు చెబుతున్నాయి. వారానికి కనీసం రెండుసార్లు చేపలను ఆహారంలో చేర్చుకోవడం వల్ల గుండె పనితీరు మెరుగుపడుతుంది.

ఎండలో గడపండి: మనలో చాలామంది ఏసీ గదులకే పరిమితమవుతున్నారు. కానీ, సూర్యరశ్మి సహజంగానే రక్తపోటును నియంత్రిస్తుంది. క్రమం తప్పకుండా ఎండలో గడపడం వల్ల ధమనుల్లో ఏర్పడే ప్లేక్ తగ్గుతుంది. తద్వారా పక్షవాతం, గుండెపోటు ముప్పు తప్పుతుంది.

నిద్రతోనే ఆరోగ్యం: చాలామంది నిద్రను విలాసంగా భావిస్తారు. కానీ, అది ప్రాథమిక అవసరం. శరీరం విశ్రాంతి తీసుకుంటున్నప్పుడు గుండె కండరాలు తమను తాము మరమ్మతు చేసుకుంటాయి. సరైన నిద్ర లేకపోతే శరీరంలో జీవక్రియలు దెబ్బతిని గుండెపై అదనపు భారం పడుతుంది. అందుకే ప్రతిరోజూ 7-8 గంటల నిద్ర తప్పనిసరి.

శారీరక శ్రమ: ఒకే చోట కూర్చుని పనిచేసే అలవాటు గుండెకు శాపం. రోజూ కనీసం 30 నిమిషాలపాటు నడక, హైకింగ్, సైక్లింగ్ వంటి వ్యాయామాలు చేస్తుండాలి. శరీర కదలికలు రక్త ప్రసరణను మెరుగుపరిచి గుండెను దృఢంగా ఉంచుతాయి.

ఒత్తిడిని తగ్గించుకోండి: వందలాది గుండెపోటు కేసుల్లో ఒత్తిడి ప్రధాన కారణంగా తేలింది. మానసిక ఆందోళన రక్తనాళాలపై ఒత్తిడిని పెంచుతుంది. యోగా, ధ్యానం వంటి పద్ధతుల ద్వారా ఒత్తిడిని నియంత్రించుకోవాలి.

పరీక్షలు చేయించుకోండి: గుండె ఆరోగ్యంపై అంచనాలతో కాకుండా, డేటా ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి. శరీరంలో ఇన్‌ఫ్ల మేషన్ లెవల్స్, హోమోసిస్టీన్, విటమిన్లు, మినరల్స్ స్థాయులను ఎప్పటికప్పుడు వైద్య పరీక్షల ద్వారా తెలుసుకోవాలి. దీనివల్ల ముప్పును ముందే పసిగట్టవచ్చు.

ఈఎంఎఫ్ తగ్గించండి: మొబైల్ ఫోన్లు, వై-ఫై నుంచి వచ్చే విద్యుదయసాంత కిరణాలు (EMF) గుండెలోని ఎలక్ట్రికల్ సిగ్నల్స్‌పై ప్రభావం చూపే అవకాశం ఉందని కొన్ని పరిశోధనలు హెచ్చరిస్తున్నాయి. అందుకే రాత్రిపూట వై-ఫై స్విచ్ ఆఫ్ చేయడం, నిద్రపోయేటప్పుడు ఫోన్‌ను దూరంగా ఉంచడం వంటి చిన్న చిన్న జాగ్రత్తలు తీసుకోవడం మన గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది.

# అన్నదాతలకు బ్యాడ్ న్యూస్

## ఈ ఏడాది సాధారణం కంటే తక్కువ వర్షపాతమేనన్న ఐఎండీ

## ఎల్ నినో పరిస్థితుల కారణంగా రుతుపవనాలు బలహీనపడనున్నాయని వెల్లడి





జాతీయం: దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక లాంటి వ్యవసాయ రంగానికి భారత వాతావరణ శాఖ చేదువార్త చెప్పింది. ఈ ఏడాది నైరుతి రుతుపవనాల సీజన్‌లో అంటే జూన్ నుంచి సెప్టెంబర్ వరకు కురిసే వర్షాలు.. దేశవ్యాప్తంగా సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదు అయ్యే అవకాశం ఉందని వెల్లడించింది. పసిఫిక్ మహాసముద్రంలో వేగంగా బలపడుతున్న 'ఎల్ నినో' పరిస్థితుల కారణంగా రుతుపవనాలు బలహీనపడే ప్రమాదం ఉందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

ఈ ఏడు సగటు కంటే తక్కువగానే వానలు..: తొలి దశ దీర్ఘకాలిక రుతుపవన అంచనాలను విడుదల చేస్తూ ఐఎండీ చీఫ్ మృత్యుంజయ్ మహాపాత్ర కీలక వివరాలు వెల్లడించారు. "ఈ సీజన్‌లో దేశవ్యాప్తంగా వర్షపాతం దీర్ఘకాలిక సగటు (ఎల్‌పీఏ)లో 92 శాతంగా ఉండే అవకాశం ఉంది. సాధారణంగా 90 నుంచి 95 శాతం మధ్య వర్షపాతం నమోదు అయితే దానిని సాధారణం కంటే తక్కువగా పరిగణిస్తాం" అని వివరించారు. ఈ ఏడాది వర్షాలు తగ్గడానికి 31 శాతం అవకాశం ఉండగా.. డెఫిషియంట్ (90% కంటే తక్కువ) కేటగిరీకి పడిపోయేందుకు 35 శాతం అవకాశం ఉందని స్పష్టం చేశారు.

ఖరీఫ్, రబీ పంటలపై ఎల్ నినో దెబ్బ..: ముఖ్యంగా దేశంలోని 'మాన్‌సూన్ కోర్ జోన్'గా పిలిచే మధ్య, పశ్చిమ భారత ప్రాంతాల్లో వర్షపాత లోటు స్పష్టంగా కనిపిస్తోందని ఐఎండీ చీఫ్ స్పష్టం చేశారు. అయితే వర్షాలపైనే ఆధారపడి సాగు అయ్యే ఈ ప్రాంతాల్లో తక్కువ వర్షాలు కురిస్తే ఖరీఫ్ పంటల సాగు గణనీయంగా తగ్గే ప్రమాదం ఉందని అన్నారు. అంతేకాకుండా వర్షాలు తగ్గడం వల్ల జలాశయాల్లో నీటి నిల్వలు క్షీణిస్తాయని.. ఇది కేవలం సాగునీటికే కాకుండా శీతాకాలంలో వేసే రబీ పంటలకు అవసరమైన భూగర్భ తేమను కూడా దెబ్బతీస్తుందన్నారు. తద్వారా ఆహార ధాన్యాల ఉత్పత్తి తగ్గి, ధరలు పెరిగే ఆస్కారం ఉందని వివరించారు. అయితే ఎల్ నినో ప్రభావాన్ని అడ్డుకునే ఒక సానుకూల అంశాన్ని కూడా ఐఎండీ ప్రస్తావించింది. హిందూ మహాసముద్రంలో ఏర్పడే 'ఇండియన్ ఓషియన్ డైపోల్' (ఐఓడీ) పరిస్థితులు ఆగస్టు నాటికి సానుకూలంగా మారే అవకాశం ఉంది. ఒకవేళ ఐఓడీ పాజిటివ్‌గా ఉంటే.. అది ఎల్ నినో వల్ల కలిగే నష్టాన్ని కొంత వరకు భర్తీ చేసి, సీజన్ ద్వితీయార్థంలో వర్షాలు కురిసేలా చేస్తుంది. కానీ ఐఓడీ పరిస్థితులు అత్యంత అస్థిరంగా ఉంటాయని శాస్త్రవేత్తలు గుర్తు చేస్తున్నారు. ఇప్పటికే పశ్చిమాసియా యుద్ధం వల్ల పెరిగిన ఇంధన, ఎరువుల ధరలతో సతమతమవుతున్న రైతులకు.. వాతావరణ శాఖ ఇచ్చిన ఈ నివేదిక మరింత ఆందోళన కలిగిస్తోంది. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు వర్షాల ఏ స్థాయిలో కురుస్తాయనే దానిపై మే నెల చివరి వారంలో ఐఎండీ మరింత స్పష్టమైన నివేదికను విడుదల చేయనుంది. చూడాలి మరి ఏం జరగనుంది అనేది.

# జువ్వలదిన్నెపై వైసీపీ నీచ రాజకీయం

## షిప్ యార్డ్‌గా జువ్వలదిన్నె అభివృద్ధికి కృషి

## ఎపి రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్



అమరావతి, ఏప్రిల్14 : జువ్వలదిన్నెపై వైసీపీ నీచ రాజకీయం చేస్తోందని ఎపి రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. దేశంలోనే తొలి అటానమస్ మారిటైం షిప్ యార్డ్‌గా జువ్వలదిన్నె అభివృద్ధి చెందబోతోందని తెలిపారు. ఈ ప్రాజెక్ట్ ఏర్పాటుతో షిప్ బిల్డింగ్, అటానమస్ సిస్టమ్స్ డెవలప్‌మెంట్, మెరైన్ ఇంజనీరింగ్, పరిశోధన, అభివృద్ధి రంగాల్లో యువతకు ఉద్యోగాలు లభిస్తాయని చెప్పుకొచ్చారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా మారిటైం రోబోటిక్స్, అటానమస్ షిప్ బిల్డింగ్ హబ్‌గా ఏపీ నిలవనుందన్నారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌ను రూ.288.80 కోట్ల పెట్టుబడితో అభివృద్ధిచేశామని మంత్రి తెలిపారు. హార్బర్ నిర్మాణం ద్వారా 25వేల మత్స్యకార కుటుంబాల జీవితాలు సమూలంగా మారబోతున్నాయని మంత్రి అనగాని అన్నారు. 1,250 మెకనైజ్డ్, మోటరైజ్డ్ చేపల పడవలను సురక్షితంగా నిలిపేలా సదుపాయం కల్పించామన్నారు. కానీ అభివృద్ధిని అడ్డుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్న మాజీ సీఎం జగన్ రెడ్డి జువ్వలదిన్నెపై విషం కక్కుతున్నారంటూ విరుచుకుపడ్డారు. జగన్ రెడ్డి ఐదేళ్లు అధికారంలో ఉండి.. ఒక్క హార్బర్‌ను గానీ, ఒక్క పోర్టును గానీ పూర్తి చేయలేక పోయారని అన్నారు. జువ్వలదిన్నె హార్బర్, రామాయపట్నం పోర్టులకు పట్టిన గ్రహణం జగన్ రెడ్డి అంటూ వ్యాఖ్యానించారు. గన్ ఆర్థిక ప్రయోజనాల కోసం తీరంలో కొత్త పోర్టులు, హార్బర్లు రాకుండా గతంలో మాజీ సీఎం వైఎస్సార్ జీవోలు ఇచ్చారని మంత్రి గుర్తుచేశారు. 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వ చర్యలతో జువ్వలదిన్నె హార్బర్‌తో పాటు రామాయపట్నం పోర్టులో కదలికవచ్చిందన్నారు. 2019 మార్చి 7న జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌కు రూ. 288 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు వచ్చాయన్నారు. జగన్ అధికారంలోకి వచ్చాక టెండర్లు ఇచ్చి డబ్బులు తిన్నారే తప్ప జువ్వలదిన్నె హర్బర్ నిర్మాణం పట్టించుకోలేదని ఆరోపించారు. 15వ తేదీన ఏం చెప్పడానికి జగన్ జువ్వలదిన్నె వస్తున్నారని ప్రశ్నించారు. కృష్ణపట్నం పోర్టు నుంచి వాడరేవు వరకు తీరంలో ఏ నిర్మాణం చేపట్టకుండా తండ్రి అధికారంతో జీఓ తెచ్చానని చెబుతారా అంటూ జగన్ మోహన్ రెడ్డిపై మంత్రి అనగాని సత్యప్రసాద్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

# లౌకిక రాజ్యాంగానికి ముప్పు

## ప్రజాతంత్ర వాదులంతా కాపాడుకోవాలి

## అంబేడ్కర్ జయంతి వేడుకల్లో సిపిఎం కార్యదర్శి



విజయవాడ, ఏప్రిల్14 : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ నాయకత్వంలో తయారైన లౌకిక రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని సిపిఐయం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మతోన్మాదుల పాలనలో రాజ్యాంగం ఈ రోజు తీవ్రమైన ప్రమాదంలో పడిందని అన్నారు. రాజ్యాంగంలో ఉన్నటువంటి మౌలికమైన లౌకికవాదమే ప్రమాదంలో పడిందన్నారు. దాని పరిరక్షణ కోసం, కాపాడుకునేందుకు మొత్తం ప్రజాతంత్ర వాదులు సామాజిక వేత్తలు అందరూ ఐక్యమై ముందుకు రావాలని కోరారు. అంబేద్కర్ జయంతి సందర్భం గా మంగళవారం ఉదయం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ . మత సామరస్యం దెబ్బతింటోందని, మతం పేరుతో దళితుల్లో చీలికలు తీసుకొచ్చి హిందువులు క్రైస్త్రవులు అనే పేరుతో చీలికలు తెస్తున్నారని విమర్శించారు. ఈరోజు క్రైస్త్రవుల మీద దళిత క్రైస్త్రవుల మీద దాడులు జరగడం అన్యాయమన్నారు. మన రాష్ట్రం ఇంతవరకు శాంతి సామరస్యాలతో ఉందని, అయితే క్రైస్త్రవులకి ముస్లింలకి వ్యతిరేకంగానూ, మైనారిటీలని అణచివేసేందుకు కుట్రపూరిత చర్యలకు దిగుతున్నారని ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వమే దీనికి ప్రోత్సాహం ఇవ్వడం బాధాకరమన్నారు. రాజ్యాంగం మీద ప్రమాణం చేసి మంత్రులు అధికారంలోకి వచ్చినటువంటి వాళ్ళు ఈ మత సామరస్యాన్ని కాపాడటానికి లౌకికవాదాన్ని కాపాడడానికి ప్రజాస్వామ్యాన్ని కాపాడడానికి ముందుకు రావాలి అని తెలిపారు. అలాగే కుల నిర్మూలన కోసం పట్టుదలతో పని చేయాలని పిలుపునిచ్చారు. కుల ఆస్తిత్వం ఉన్నంత కాలం కుల నిర్మూలన సాధ్యం కాదని బాబాసాహెబ్ అంబేద్కర్ కుండ బద్దలు కొట్టినట్టు చెప్పారన్నారు. ఈరోజు అనేక జిల్లాల్లో కులాంతర వివాహాలు చేస్తున్నవాళ్ళని సొంత కుటుంబీకులే హత్యలు చేస్తున్నారని, పరువు పేరుతో ఈ హత్యల నుండి కాపాడటానికి కులాంతర వివాహాలు చేసుకున్న వాళ్ళకి రక్షణ కల్పించడానికి ఒక ప్రత్యేక చట్టం కూడా చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. అలాగే దళిత క్రిస్టియన్ల మీద జరుగుతున్న దాడులను ఎదుర్కొనేందుకు దళిత క్రిస్టియన్ల అందరిని కూడా ఎస్సీలుగానే గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐయం రాష్ట్ర కమిటీ సభ్యులు ఆంధ్ర మాల్యాద్రి, జె. జయరాం, యు. వి. రామరాజు పాల్గొన్నారు.

# ఘనంగా భారతరత్న డాక్టర్ అంబేద్కర్ జయంతి



హుజూర్ నగర్ ఏప్రిల్ 14 తెలంగాణ వాణి :హుజూర్ నగర్ పట్టణంలోనే మల్లన్న నగర్ నందు అంగన్ వాడి సెంటర్ నందు అంగన్ న్వాడి టీచర్ దగ్గుపాటి శాంతారాజ్యం ఆధ్వర్యంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేద్కర్ అనగారిన మహర్ కుటుంబంలో పుట్టి చిన్నప్పటి నుంచి కుల వివక్షను ఎదుర్కొని తనలా ఎవరు కష్టాలుపడకూడదని సమాజంలో ఉన్న అసమానతలు తొలగించాలని ఆయన సంకల్పించారు అందుకే ఎక్కువగా చదివి జ్ఞానం సంపాదించి బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడారు ఆయన గురించి ఎంత మాట్లాడిన తక్కువే అని భారత రాజ్యాంగాన్ని రూపొందించి అందరికీ సమాన హక్కులు కల్పించిన మహనీయుడికి బలహీన వర్గాల ఆశాజ్యోతి జయంతిని వర్ధంతిని జరుపుకోవడం ఆనవైతిగా అయ్యింది మహనీయుడు ఇచ్చిన హక్కులను పాటిస్తూ వాటికోసం పోరాడ టమే నిజమైన నివాళులు అని వారు తెలియజేశారు ఈ కార్యక్రమంలో గర్భిణీ స్త్రీలు బాలింతలు చంటిపిల్లలు తదితరులు పాల్గొన్నారు

# యాదగిరిగుట్ట లో ఘనంగా బాబా సాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు




యాదగిరిగుట్ట ఏప్రిల్: 14(తెలంగాణవాణి విలేఖరి): నివాళులర్పించిన ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య యాదగిరిగుట్ట పట్టణంలోని బాబా సాహెబ్ అంబేద్కర్ 135వజయంతి సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే శ్రీ బీర్ల అయిలయ్య అంబేద్కర్ విగ్రహానికి పులామాల వేసి ఘనంగా నివాళులర్పించారు. తర్వాత రోడ్డు భద్రత లో భాగంగా అవగహన కల్పించడం కోసం పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య మాట్లాడుతూబాబా సాహెబ్ అంబేద్కర్ గారి జయంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళులు అర్పించారు. భారత రాజ్యాంగ రూపకర్తగ సామాజిక న్యాయానికి మార్గదర్శిగా, అణగారిన వర్గాల అభ్యున్నతికి జీవితాన్ని అంకితం చేసిన మహానుభావుడు డాక్టర్ అంబేద్కర్ చిన్ననాటి నుంచి ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నప్పటికీ, విద్యను ఆయుధంగా తీసుకుని ప్రపంచ స్థాయి విద్యను అభ్యసించి భారతదేశానికి గొప్ప దిశానిర్దేశం చేశారు. ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించేలా రాజ్యాంగాన్ని రూపొందించడం ఆయన గొప్ప కృషిసమాజంలో ఉన్న అసమానతలను తొలగించేందుకు కులవ్యవస్థకు వ్యతిరేకంగా ఆయన చేసిన పోరాటం ఎన్నటికీ మరువలేనిది. "విద్య పొందండి,సంఘటితమవండి పోరాడండి" అనే ఆయన సందేశం నేటి యువతకు మార్గదర్శకం.

ప్రభుత్వం కూడా అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా పేదలు, దళితులు, బీసీల అభివృద్ధికి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోంది. ప్రతి వర్గం అభివృద్ధి చెందేలా కృషి కొనసాగుతోంది.యువత అంబేద్కర్ యొక్క ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని చదువులో ముందుండి, సమాజానికి ఉపయోగపడేలా ఎదగాలి. సమానత్వం, సోదరభావం న్యాయం అనే విలువలను మన జీవితంలో ఆచరించాలి. చివరగా మనమందరం కలిసి అంబేద్కర్ ఆశయాలను పాటిస్తూ సమానత్వ సమాజాన్ని నిర్మించేందుకు కట్టుబడి ఉండాలి.

# వేసవిలో పిల్లలు ఎన్ని నీళ్లు తాగాలి?



ఈ వయసు పిల్లలు ఇన్ని నీళ్లు తాగాలని కచ్చితంగా చెప్పలేం. ఎందుకంటే శరీరానికి నీటి అవసరం వయసు, ఆటలు, వాతావరణం, చెమట, అనారోగ్య సమస్యలను బట్టి ఉంటుంది. అందరూ ఒకే విధమైన జీవన శైలి, అలవాట్లను కలిగి ఉండరు. కాబట్టి అందరూ ఇంత పరిమాణంలో నీళ్లు తాగాలని చెప్పలేం. సాధారణంగా ఒకటి నుంచి నాలుగేళ్ల లోపు పిల్లలు రోజుకు 1 లీటరు నీళ్లు తాగాలి. అయిదు నుంచి తొమ్మిదేళ్ల లోపు పిల్లలు రోజుకు 1.5 లీటర్ల నీళ్లు తాగాలి. తొమ్మిది నుంచి పద్నాలుగేళ్ల లోపు పిల్లలు 2 లీటర్ల నీళ్లు తాగాలి. వేడి వాతావరణం, ఆటలను బట్టి దప్పిక వేస్తే ఎక్కువ నీళ్లు తాగాల్సి ఉంటుంది.

కొంతమంది పిల్లలు నీళ్లు తాగరు. ఫ్రూట్ జ్యూస్ ఇస్తే శరీర నీటి అవసరం తీరుతుందని మార్కెట్లో ఉన్న బేవరేజ్ డ్రింక్స్ కొంటున్నారు. అవి వంద శాతం ఫ్రూట్ జ్యూస్ అంటారు. కానీ, అందులో నాన్ షుగర్ స్వీట్‌నెస్, యాడెడ్ షుగర్స్, రంగులు, నిల్వ రసాయనాలు కలుపుతారు. వీటితో ఆరోగ్య సమస్యలు వస్తాయి. షుగర్ వల్ల దంత సమస్యలు, ఒబెసిటీ వచ్చే ప్రమాదం ఉంది. వాటికి బదులుగా ఇంట్లోనే పండ్లతో జ్యూస్ తయారు చేసి ఇస్తే పిల్లలు ఇష్టంగా తాగుతారు. దీని నుంచి శరీరానికి కావాల్సిన నీటితోపాటు ఎనర్జీ, ఖనిజ లవణాలు కూడా అందుతాయి.

తొమ్మిది నుంచి పదమూడేళ్లలోపు పిల్లలకు 180 మిల్లీ లీటర్లు జ్యూస్ ఇవ్వొచ్చు. 13 ఏళ్లు పైబడిన వాళ్లు 250 మిల్లీ లీటర్ల జ్యూస్ తాగొచ్చు. అలాగే పుచ్చకాయ, ఖర్బూజ, స్ట్రాబెర్రీ, నారింజ పండ్లు తినమని ఇవ్వాలి. పండ్ల రసాలు బయట కొన్నా రంగులు, నిల్వ రసాయనాలు, షుగర్ లేనివి కొనివ్వాలి. పిల్లలకు కార్బొనేటెడ్ డ్రింక్స్ అసలే కొనొద్దు. వీటిలో చక్కెర అధిక మోతాదులో ఉంటుంది. కెఫిన్ కూడా ఉంటుంది. దీని వల్ల దాహం పెరుగుతుంది. పిల్లలు ఆటలు ఆడేప్పుడు నీళ్లు తాగరు. దాహమని చెప్పరు. కాబట్టి పెద్దలు గంట, అరగంటకు ఒకసారి నీళ్లు తాగాలని పిల్లలకు చెప్పాలి. తాగకపోతే పెద్దలే తాగించాలి.

## ఖమ్మం కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా కొప్పుల ప్రభావతి రెడ్డి నియామకం

ఏన్కూర్: ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా ఏన్కూర్‌కు చెందిన కొప్పుల ప్రభావతి రెడ్డి నియమిస్తూ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బి.మహేష్ కుమార్ గౌడ్ నియామక పత్రం అందజేశారు. పార్టీ సంస్థాగత బలోపేతం, క్షేత్రస్థాయిలో కార్యకర్తల సాధికారత అంతర్గత ప్రజాస్వామ్య పరిరక్షణ లక్ష్యంగా నియామకం చేపట్టడం జరిగిందని, గ్రామస్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం తన శాయశక్తులా కృషి చేస్తానని నియామకం పొందిన కొప్పుల ప్రభావతి రెడ్డి తెలిపారు.కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ప్రజా సంక్షేమ పథకాలు ప్రజల్లో తీసుకెళ్లేందుకు తాను నిత్యం కృషి చేస్తానని ప్రభావతి రెడ్డి తెలిపారు. తనకు నియామక పత్రం అందజేసిన టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వైరా నియోజకవర్గ ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్, ఖమ్మం ఎంపీ, రఘురాం రెడ్డి, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, నూతి సత్యనారాయణ గౌడ్, ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## దొంతిలో ఉద్రిక్త పరిస్థితులు..

## వాహనాన్ని చుట్టుముట్టి గ్యాస్ సిలిండర్లు తీసుకెళ్లిన గ్రామస్తులు



శివంపేట, ఏప్రిల్ 14 : మెదక్ జిల్లా శివంపేట మండలంలోని దొంతి గ్రామంలో గ్యాస్ సిలిండర్ల కొరత ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది. శ్రీ వెంకటరమణ భారత్ గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది వినియోగదారులకు సిలిండర్లు పంపిణీ చేయడానికి గ్రామానికి చేరుకున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. గ్రామంలోని పలువురు లబ్ధిదారులు గ్యాస్ కోసం ముందుగా బుకింగ్ చేసుకోవడానికి ప్రయత్నించినప్పటికీ బుకింగ్ నమోదు కాకపోవడంతో సిలిండర్లు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. ఇదే సమయంలో సిలిండర్లతో గ్రామానికి వచ్చిన భారత్ గ్యాస్ వాహనాన్ని కొందరు గ్రామస్తులు ఒక్కసారిగా చుట్టుముట్టారు. ఈ సందర్భంగా కొంతమంది సిలిండర్లను వాహనం నుంచి తీసుకెళ్లినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ప్రాథమికంగా మూడు గ్యాస్ సిలిండర్లు తీసుకెళ్లినట్లు గుర్తించగా, వాటిలో రెండు సిలిండర్లను పోలీసులు తిరిగి రికవరీ చేసినట్లు తెలిపారు. మరో సిలిండర్ ఇంకా రికవరీ చేయాల్సి ఉంది. గ్యాస్ బుకింగ్ వ్యవస్థ సక్రమంగా పనిచేయకపోవడం వల్ల గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు సమస్యను త్వరగా పరిష్కరించి గ్రామస్తులకు గ్యాస్ సరఫరా సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## బుగ్గారం మండలం పలు గ్రామాల్లో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు



జగిత్యాల బుగ్గారం 14 ఎప్రిల్ (తెలంగాణ వాణి విలేకరి ): జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం యశ్వంతరావు పేట గోపులాపూర్, గంగాపూర్, శకల్ల, చిన్నాపూర్ వెలుగొండ సందయ్య పల్లె, మద్దునూర్, సిరికొండ పలు గ్రామాల్లో గ్రామపంచాయతీ ఆవరణలో అంబేద్కర్ జయంతి వేడుకలు డిజె సౌండ్ లతో సందడిగా ప్రతి గ్రామంలో అందరూ కమిటీ సభ్యులందరూ కలిసి మెలిసి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా జరిపారు. గ్రామ సెక్రెటరీ మరియు నూతన సర్పంచులు పాలకవర్గం వార్డు సభ్యులు గ్రామ ప్రజలు అందరూ సాముహికంగా పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో కాకుండా వివిధ కమిటీ సభ్యులు కూడా అంబేద్కర్ జయంతిని జరుపుకుంటూ ఈ సందర్భంగా మాట్లాడుతూ అంబేద్కర్ అంటే కొందరి వాడు కాదు అంబేద్కర్ అంటే అందరివాడు ఆయన చేసిన త్యాగం ఆయన చేపట్టిన పట్టుదల అంబేద్కర్ రాసిన రాజ్యాంగం అందరిని అనుసరించి న మహా గొప్ప వ్యక్తి అందరికీ అనుకూలంగా రాజ్యాంగ ప్రకారం రిజర్వేషన్లు కల్పించే విధంగా పాటుపడ్డ గొప్ప ముద్దుబిడ్డ అంబేద్కర్ అంటూ పొగడ్తలతో ఆయనను తపిస్తూ కార్యక్రమాలను పూర్తి చేశారు.

## డాక్టర్ బి.ర్ అంబేద్కర్ కు నివాళు లర్పించిన బిజెపి మండల అధ్యక్షులు భూక్య సంపత్ నాయక్



హుస్నాబాద్ ఏప్రిల్ 14 (తెలంగాణ వాణి ఆర్ సి) భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా హుస్నాబాద్ మండలం పోతారం ఎస్ గ్రామంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు భూక్య సంపత్ నాయక్. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యను ఆయుధంగా చేసుకుని, ఉన్నత చదువులు చదివి, భారత దేశంలోనే అత్యంత విద్యావంతులలో ఒకరిగా అంబేద్కర్ నిలిచారన్నారు. స్వతంత్ర భారత రాజ్యాంగాన్ని రచించి, దేశ పౌరులందరికీ స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం కల్పించడంలో కీలక పాత్ర పోషించారని ఆయన తెలిపారు. విద్య ద్వారానే మన హక్కులను సాధించుకోగలమని అంబేద్కర్ నిరూపించారని ఆయన చెప్పారు.ఆయన చూపిన మార్గంలో నడుస్తూ, సమానత్వంతో కూడిన, అభివృద్ధి చెందిన భారత దేశాన్ని నిర్మించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని భూక్య సంపత్ నాయక్ అన్నారు. ఈ కార్యక్రమం లో సిద్దిపేట జిల్లా ఓబీసీ మోర్చ అధ్యక్షులు బొమ్మగాని సతీష్,మండల అధ్యక్షులు విద్యాసాగర్,మాజీ ఎంపీటీసీలు బాణాల జయలక్ష్మి,కుంట మల్లయ్య, నాయకులు పూదరి కిష్టయ్య, బూతగడ్డపు బాలరాజు,బైరి అరుణ్, వెంకటేష్,పెనాల శ్రీనివాస్, చంద్రశేఖర్ రెడ్డి, రత్నాకర్ రెడ్డి, ప్రశాంత్, శ్రీనివాస్ కిరణ్,శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఇష్టపడి చదివాడు.. కష్టపడి ఎదిగాడు.. అంబేద్కర్ ఓ స్ఫూర్తి

హైదరాబాద్: డాక్టర్ భీమ్‌రావ్ రామ్‌జీ అంబేద్కర్.. మధ్యప్రదేశ్‌లోని మోవ్ కాంటోన్మెంట్‌లో 1891, ఏప్రిల్ 14వ తేదీన జన్మించారు. మహారాష్ట్రలోని సతారా జిల్లాలో ఆయన తన ప్రైమరీ స్కూల్ విద్యను పూర్తి చేశారు. బాంబేలోని ఎల్ఫిన్‌స్టోన్ హైస్కూల్‌లో సెకండరీ విద్యను అభ్యసించారు. దేశంలో వివక్ష తీవ్ర స్థాయిలో ఉన్న దశలో ఆయన విద్యను అభ్యసించడం గమనార్హం. షెడ్యూల్ కులాల వర్గ ప్రజలను అప్పట్లో అంటరానివారిగా చూసేవారు. అలాంటి పరిస్థితుల్లో అంబేద్కర్ చదువు పట్ల తన శ్రద్ధను వదులుకోలేదు. సమాజం కఠినంగా ఉన్నా.. అంతకన్న రెట్టింపు దీక్షతో స్కూలింగ్ పూర్తి చేశాడు. స్కూల్‌లో ఉన్న కామన్ వాటర్ ట్యాప్ వద్ద నీళ్లను తాగనివ్వలేదన్న విషయాన్ని ఆయన తన ఆటోబయోగ్రఫీ 'వెయిటింగ్ ఫర్ ఎ వీసా'లో రాశారు. 1912లో బాంబే యూనివర్సిటీ నుంచి అంబేద్కర్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. ఎకనామిక్స్ అండ్ పొలిటికల్ సైన్స్‌లో ఆయన బీఏ చేశారు. కాలేజీలో పర్ఫార్మెన్స్ చూసి 1913లో ఆయనకు సయ్యాజిరావు గైక్వాడ్ స్కాలర్‌షిప్‌ను అందజేశారు. అమెరికాలోని న్యూయార్క్‌లో ఉన్న కొలంబియా యూనివర్సిటీలో ఎంఏ, పీహెచ్‌డీ చదువుకునేందుకు బరోడా రాష్ట్ర మహారాజు కూడా ఆయన స్కాలర్‌షిప్ అందజేశారు. ద అడ్మినిస్ట్రేషన్ అండ్ ఫైనాన్స్ ఆఫ్ ద ఈస్ట్ ఇండియా కంపెనీ థీసీస్ టైటిల్‌తో ఆయన 1916లో మాస్టర్స్ పూర్తి చేశారు. ద ఎవల్యూషన్ ఆఫ్ ప్రావిన్షియల్ ఫైనాన్స్ ఇన్ ఇండియా: ఎ స్టేడీ ఇన్ ద ప్రావిన్షియల్ డీసెంట్రలైజేషన్ ఆఫ్ ఇంపీరియల్ ఫైనాన్స్ అన్న టైటిల్‌తో ఆయన పీహెచ్‌డీ థీసీస్ రాశారు.కొలంబియా యూనివర్సిటీలో పీజీ పూర్తి చేశాక, అంబేద్కర్ లండన్‌కు వెళ్లారు. అక్కడ లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ పొలిటికల్ సైన్స్‌లో రిజిస్టర్ చేసుకున్నారు. ఆర్థికశాస్త్రాన్ని చదివేందుకు ఆయన రిజిస్టర్ చేశారు. ఇక గ్రేస్ ఇన్‌లో ఆయన న్యాయ విద్య అభ్యసించేందుకు ఎన్‌రోల్ చేసుకున్నారు. అయితే డబ్బు సరిపోకపోవడం వల్ల ఆయన 1917లో ఇండియాకు తిరిగి వచ్చారు. 1918లో ముంబైలోని సిడెనం కాలేజీలో పొలిటికల్ ఎకానమీ ప్రొఫెసర్‌గా విధుల్లో చేరారు. కాలేజీలో ప్రొఫెసర్‌గా చేస్తున్న సమయంలోనే యువత ఓటు హక్కు గురించి సౌత్‌బరో కమిటీకి ఆయన ఓ స్టేట్మెంట్ అందజేశారు. 1920లో అంబేద్కర్ మళ్లీ లండన్ వెళ్లారు. కొల్హాపూర్‌లోని ఛాత్రపతి సాహూజీ మహారాజ్ నుంచి ఆర్థిక సాయం పొందారు. వారితో పాటు ఓ మిత్రుడు తీసుకున్న పర్సనల్ లోన్, ఇండియాలో పనిచేసిన డబ్బులతో ఆయన లండన్‌కు వెళ్లారు. విద్యను సంపూర్ణంగా పూర్తి చేయాలన్న ఉద్దేశంతో ఆయన లండన్‌కు వెళ్లాల్సి వచ్చింది. 1922లో ఆయనకు బార్ నుంచి పిలుపు వచ్చింది. ఆ తర్వాత ఆయన బారిస్టర్ అయ్యారు. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ నుంచి ఆయన ఎంఎస్సీ, డీఎస్సీ పూర్తి చేశారు. ద ప్రాబ్లం ఆఫ్ ద రూపీ పేరుతో ఆయన డాక్టరేట్ థీసీస్‌ను ప్రచురించారు. భారత్‌కు తిరిగివచ్చిన తర్వాత అంబేద్కర్ ఓ సంస్థను స్థాపించారు. బహిష్కృత్ హితకర్ణి సభను ఆయన ఏర్పాటు చేశారు. దాని ఆధారంగా ఆయన సామాజిక ఉద్యమాలు చేపట్టారు. 1927లో ఆయన మహద్ సత్యాగ్రహం చేపట్టారు. భారత సమాజంలో అణిచివేతకు గురైన కులాల వారికి ప్రజా వనరులు సమంగా దక్కాలని ఆయన ఆ వేదికగా డిమాండ్ చేశారు. ఇక ఆ సంవత్సరంలో ఆయన బాంబే లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో ఓ సభ్యుడిగా నామినేట్ అయ్యారు. 1928లో రాజ్యాంగ సంస్కరణల గురించి సైమన్ కమిషన్ ముందు ఆయన కొన్ని వినతులు సమర్పించారు. ఇండియన్ స్టాట్యూటరీ కమిషన్‌గా భావించే సైమన్ కమిషన్ ముందు ఆయన మూడు సార్లు రౌండ్‌టేబుల్ సమావేశాలకు హాజరయ్యారు. 1930 నుంచి 32 మధ్యకాలంలో ఆ కాన్ఫరెన్సులు జరిగాయి. ఆ సమయంలో అంబేద్కర్ తన విన్నపాలు అందజేశారు. 1935లో ముంబైలోని గవర్నమెంట్ లా కాలేజీలో ప్రిన్సిపాల్‌గా నియమితుడయ్యారు. 1928 నుంచి ఆ కాలేజీలోనే ఆయన ప్రొఫెసర్‌గా పాఠాలు బోధించారు. వైస్‌రాయ్స్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లో ఆయన కార్మిక సభ్యుడిగా నియమితుడయ్యారు. 1946లో భారత రాజ్యాంగ పరిషత్(కాన్‌స్టూటూయెంట్ అసెంబ్లీ ఆఫ్ ఇండియా)కి ఎన్నికయ్యారు. 1947 ఆగస్టు 15వ తేదీన భారత దేశ తొలి న్యాయశాఖ మంత్రిగా అంబేద్కర్ ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్యాంగ పరిషత్ డ్రాఫ్టింగ్ కమిటీ చైర్మెన్‌గా ఆయన్ను ఎన్నుకున్నారు. ఆ తర్వాత ఆయన భారతీయ రాజ్యాంగాన్ని రాసే ప్రక్రియకు పూనుకున్నారు. భారతీయ రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై ప్రశంసల జల్లు కురిసింది. రాజ్యాంగ పరిషత్ సభ్యులు మహావీర్ త్యాగి, తొలి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ .. అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని విశేషంగా మెచ్చుకున్నారు. ఎంతో అంకితభావం, ఉత్సాహంతో అంబేద్కర్ రాజ్యాంగ ముసాయిదాను రూపొందించినట్లు రాజేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. డ్రాఫ్టింగ్ కమిటీ చైర్మెన్‌గా అంబేద్కర్ అసాధారణ ప్రతిభను కనబరిచినట్లు ఆయన్ను కీర్తించారు. 1952లో జనరల్ ఎలక్షన్స్ తర్వాత ఆయన రాజ్యసభ సభ్యుడయ్యారు. ఆ సంవత్సరంలోనే కొలంబియా యూనివర్సిటీ ఆయనకు గౌరవ డాక్టరేట్ అందజేసింది. 1953లో హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ కూడా గౌరవ డాక్టరేట్‌ను అందజేసింది. 1955లో ఆయన ఆరోగ్యం



క్షీణించింది. 1956 డిసెంబర్ 6వ తేదీన సుదీర్ఘ అస్వస్థత వల్ల ఢిల్లీలో అంబేద్కర్ తన తుదిశ్వాస విడిచారు. అంబేద్కర్ గురించిన రాసిన ఈ వ్యాసం సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లోనిది. న్యాయవాదిగా రిజిస్టర్ చేసుకుని వందేళ్లు పూర్తి అయిన సందర్భంలో అంబేద్కర్‌ను స్మరిస్తూ ఈ వ్యాసాన్ని పోస్టు చేశారు. అంబేద్కర్ కఠోర శ్రమ ఆయన్ను ఉన్నత విద్యావంతుడిగా తీర్చిదిద్దింది. సమాజంలో అసమానతలు ఉన్నా.. ఆయన మాత్రం తన చదువును ఆపలేదు. విద్యార్జనకు, వ్యక్తి ఔన్నత్యానికి, సమాజ సేవకు అంటరానితనం లేదని తన ఎదుగుదలతో ఆయన నిరూపించారు. చదువుతో సంస్కారాన్ని, సమాజాన్ని మార్చే ప్రయత్నం చేశారు. అందుకే అంబేద్కర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుందాం. ఆయన రాజ్యాంగాన్నే పాటిద్దాం. ఆత్మసాక్షిగా ఆచరిద్దాం.

# గిరిజన బిడ్డలకు 16వ డివిజన్ లో పౌర సన్మానం

### గిరిజన బిడ్డలను శాలువాతో సత్కరిస్తున్న కార్పొరేటర్ మునిగడప పద్మ, వెంకటేశ్వర్లు



కొత్తగూడెం (తెలంగాణ వాణి): ఇంటర్మీడియట్ ఫలితాల్లో చిట్టిరామరానికి చెందిన గిరిజన బిడ్డలు భూక్య ప్రజ్ఞ బాయ్, ఝాన్సీ బాయ్ లు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించినందుకు గాను వారిని అంబేద్కర్ సాక్షిగా 16వ డివిజన్ కార్పొరేటర్ మునగడప పద్మ శాలవాలతో పౌర సన్మానం చేసి స్వీట్లు పంపిణీ చేశారు. మంగళ వారం అంబేద్కర్ చమన్ లో జరిగిన అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా 16వ డివిజన్ కార్పొరేటర్ మునిగడప పద్మ ,మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మునిగడప వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలోని చిట్టి రామవరం ప్రాంతానికి చెందిన మాజీ కౌన్సిలర్ భూక్య శ్రీనివాస్ అంగన్వాడి టీచర్ దేవి ల కుమార్తెలు ఇటీవల ప్రకటించిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో భూక్య ప్రజ్ఞ బాయ్ కి ఎంపీసీలో 1000 మార్కులకు గాను 984 మార్కులు, అలాగే రెండవ కూతురు భూక్య ఝాన్సీ భాయ్ ఎంపీసీ విభాగంలో 1000 మార్కులకు గాను 853 మార్కులతో ఇద్దరు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించడం రామవారానికి గర్వకారణం అని వారు అభినందించారు. డివిజన్ ప్రజలు శాలువాతో ఘనంగా సత్కరించి, స్వీట్ పంపిణీ చేశారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశించిన ఆశయాలలో భాగంగా ఒక గిరిజన బిడ్డలు రాష్ట్రస్థాయి ప్రథమ ర్యాంకులు సాధించడం అభినందనీయమని వక్తలు పేర్కొన్నారు. ఈ పౌర సన్మానంలో నాయకులు మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మునిగడప వెంకటేశ్వర్లు, మాజీ కౌన్సిలర్ గిరిజన నాయకులు భూక్య శ్రీనివాస్ అంగన్వాడీ టీచర్స్ సరోజ, డీ నీలవేణి, షహనాజ్ బేగం, తోగరు నరేంద్ర కుమార్, బయాన ఈశ్వరయ్య, హాజరయ్య, దుర్గయ్య , దిలీప్, నరేష్, గోపి ,రామ్ రాకేష్ ,వాసం బాబు తదితరులు పాల్గొన్నారు.

# డా. బి.ఆర్. అంబేద్కర్ ఆశయ సాధనతో దేశాభివృద్ధి సాధ్యం

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల (తెలంగాణ వాణి):రాజ్యాంగ నిర్మాత సమానత్వ సమాజం కోసం కృషి చేసిన మహనీయుడు డా. బి.ఆర్. అంబేద్కర్ ఆశయ సాధన తో దేశాభివృద్ధి సాధ్యమని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. డా. బి.ఆర్. అంబేద్కర్ 175 వ జయంతిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని ఐ.బి చౌరస్తాలో జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి.చంద్రయ్య జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్ జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్ వివిధ బి. సి. సంఘాల నాయకులతో కలిసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించిన అనంతరం నస్పూర్ లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి డి.సి.పి. ఎ.భాస్కర్ జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి.చంద్రయ్య ఇన్చార్జ్ జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీనివాస్ రావు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్ వివిధ బిసి సంఘాల నాయకులతో కలిసి హాజరై కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత దళిత బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డా. బి.ఆర్. అంబేద్కర్ దేశానికి అందించిన సేవలు సదా స్మరణీయమని భారతదేశ స్వాతంత్ర ఉద్యమంలో తన వంతు పాత్ర పోషించడమే కాకుండా సమాజంలో సమానత్వం మహిళల అభివృద్ధి కుల మత వర్ణ వర్గ ప్రాంత విభేదాలు లేకుండా దేశ పౌరులుగా అందరూ సమానమైన అని తెలుపుతూ రాజ్యాంగ రచన చేశారని విద్యాభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. ఆనాటి సమాజంలోని అసమానతలను ఎదుర్కొని ఉన్నత విద్యను అభ్యసించి సమాన అవకాశాల కోసం రాజ్యాంగాన్ని రచించారని మన దేశ రాజ్యాంగం వివిధ దేశాల రాజ్యాంగాల ప్రేరణతో రూపొందించబడిందని తద్వారా నేడు దేశ పరిపాలన సులభతరమైందని తెలిపారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశంలో రాజ్యాంగం అందరికీ ఆదర్శంగా నిలిచిందని సంక్షేమ పథకాల అమలు రాజ్యాంగం ప్రకారమే జరుగుతోందని ప్రతి ఒక్కరికీ చదువుకునే హక్కు స్వేచ్ఛగా జీవించే హక్కులు రాజ్యాంగం ద్వారా కల్పించబడిందని తెలిపారు. డి సి పి మాట్లాడుతూ డా. బి.ఆర్. అంబేద్కర్ విశ్వ మానవతావాది అని అందరి వాడని తాను ఎదుర్కొన్న కష్టాలు మరెవ్వరూ అనుభవించకూడదనే సంకల్పంతో సమానత్వానికి పునాది వేశారని తెలిపారు. మహిళలకు అవకాశాలు కల్పించడం కార్మికులకు 8 గంటల పని విధానం అమలు ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం వంటి కీలక సంస్కరణలకు కృషి చేశారని అన్నారు.అనంతరం డా. బి.ఆర్. అంబేద్కర్ పై తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు బీర్పూర్ శ్రీనివాస్ రచించి మామిళ్ళ లచ్చన్న ఆలపించిన గీతాన్ని ఆవిష్కరించారు. అంబేద్కర్ గొప్పతనాన్ని ప్రతిబింబిస్తూ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు పాటలు నాటకాలు అందరినీ అలరించాయి కులాంతర వివాహాలు చేసుకున్న జంటలకు ప్రోత్సాహకాలు అందజేశారు.అంతకుముందు రాష్ట్ర కార్మిక ఉపాధి శిక్షణ కర్మాగార గనులు భూగర్భ శాఖామంత్రి గడ్డం వివేకానంద మంచిర్యాల పట్టణంలోని ఐ. బి. చౌరస్తాలో గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. తదనంతరం మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ దర్శి మధుకర్ అధికారులు ప్రజా ప్రతినిధులతో కలిసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమాలలో సంబంధిత శాఖల అధికారులు బి.సి. సంఘాల ప్రతినిధులు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# రోడ్డు నిబంధనల పాటనే ప్రాణరక్ష

**కరీంనగర్ జిల్లాలో ఘనంగా 'అరైవ్ అలైవ్' కార్యక్రమం**

**గతేడాది 200 మంది మృతి**

**హెల్మెట్ తప్పనిసరన్న సీపీ గౌస్ ఆలం**

**ప్రమాద బాధితులను ఆదుకుంటే రూ.25 వేల రివార్డు**

**ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రోడ్డు భద్రతా అవగాహన సదస్సు**



కరీంనగర్ (తెలంగాణ వాణి): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా,జిల్లా పోలీస్ శాఖ, రెవెన్యూ మరియు రవాణా శాఖల సమన్వయంతో మంగళవారంకరీంనగర్ కోర్టు చౌరస్తాలో 'అరైవ్ అలైవ్' రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమం నిర్వహించబ డింది.డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు,అధికారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ముఖ్య అతిథుల సందేశం: ఈ కార్యక్రమానికి చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్,సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజర య్యారు.జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం విశిష్ట అతిథులుగా పాల్గొని,రహదారి భద్రతపై ప్రజలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా సీపీ గౌస్ ఆలం అరైవ్ అలైవ్'కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ చిత్రా మిశ్రా అందరితో రోడ్డు నియమాలు పాటిస్తామని ప్రతిజ్ఞ చేయిం చారు.

సీపీ గౌస్ ఆలం కీలక వ్యాఖ్యలు:జిల్లాలో జరుగు తున్న రోడ్డు ప్రమాదాలపై సీపీ ఆందోళన వ్యక్తం చేశారు. గతేడాది జిల్లాలో రోడ్డు ప్రమాదాల వల్ల 200 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో అధిక శాతం ద్విచక్ర వాహనదారులే ఉండటం విచారకరం. హెల్మెట్ ధరించకపోవడం,ట్రిపుల్ రైడింగ్ చేయడం వల్లే ఎక్కువ మరణాలు సంభవిస్తున్నాయి.

పోలీసుల నిరంతర నిఘా, చర్యల వల్ల జిల్లాలో ప్రమాదా ల రేటు 17 శాతం తగ్గింది.ప్రమాదం జరిగిన గోల్డెన్ అవర్'లో బాధితులను ఆసుపత్రికి చేర్చి ప్రాణాలు కాపాడిన వారికి ప్రభుత్వం రూ. 25 వేల నగదు బహుమ తి అందజేస్తుందని సీపీ తెలిపారు.

ప్రభుత్వ పథకాలు – చికిత్స:రహదారి ప్రమాద బాధితుల కోసం ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సీపీ వివరించా రు:రహ వీర్ పథకం:ఎంపిక చేసిన ఆసుపత్రుల్లో ప్రమాద బాధితులకు రూ. 1.5 లక్షలవరకు ఉచిత నగదు రహిత చికిత్స అందుబాటులో ఉంది.

హిట్అండ్‌రన్ కేసులు:హిట్ అండ్ రన్ కేసుల్లో బాధితుల కు ప్రభుత్వం తరపున ప్రత్యేక ఆర్థిక సహాయం అందుతుంది. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు,పోలీస్ సిబ్బంది మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని రోడ్డు భద్రతపై అవగాహన పెంచుకున్నారు.

# సినిమా

## స్వరరాగాల సుర సుర..



ప్రసిద్ధ దేవాలయాల్లో నిక్షిప్తమై ఉండే నేలమాళిగలు, వాటిలో దాగుండే నిధి నిక్షేపాలు, వాటి వెనుక రహస్యాలు, దైవ నిర్ణయాలు.. తదితర అంశాల కలబోతగా రూపొందుతున్న పానిండియా మైథలాజికల్ యాక్షన్ అడ్వెంచర్ 'నాగబంధం'. విరాట్‌కర్ణ కథానాయకుడిగా అభిషేక్ నామా దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రానికి కిశోర్ అన్నపురెడ్డి, నిషితా నాగిరెడ్డి నిర్మాతలు. నభా నటేష్, ఐశ్వర్యమేనన్ కథానాయికలు. జులై 3న సినిమా విడుదల కానున్నది. ప్రమోషన్స్‌లో భాగంగా ఈ సినిమా నుంచి రెండో పాటను ఈ నెల 19న విడుదల చేయనున్నారు. 'సుర సుర' అంటూ సాగే ఈ పాటను.. సంప్రదాయ పెళ్లి సంబరాల ఆనందోత్సాహాలను ప్రతిబింబించేలా భారీ సెట్స్, గ్రాండ్ విజువల్స్‌తో రూపొందించారు.

జునైద్ కుమార్ అభే సంగీతం, గణేశ్ ఆచార్య కొరియోగ్రఫీ ఈ పాటకు హైలైట్స్‌గా నిలువనున్నాయి. అనురాగ్ కులకర్ణి, కాలభైరవ, మంగ్లీ, సాహితి చాగంటి, కనకవ్వ, నల్గొండ గద్దర్ ఈ పాటను ఆలపించగా, కాసర్ల శ్యామ్ రాశారు. ఈ సినిమాకే ఈ పాట ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని మేకర్స్ చెబుతున్నారు.

## నేను రఫ్ డాడ్ .. పిల్లల పెంపకంపై రామ్ చరణ్ ఆసక్తికర వ్యాఖ్యలు



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, ఆయన భార్య ఉపాసన కొణిదెల ప్రస్తుతం ముగ్గురు పిల్లలతో సంతోషకరమైన కుటుంబ జీవితం గడుపుతున్నారు. 2023లో జన్మించిన క్లింకాతో పాటు, 2026 జనవరిలో ఈ దంపతులకు కవలలు (ఒక బాబు, ఒక పాప) పుట్టిన సంగతి తెలిసిందే. మెగాస్టార్ చిరంజీవి స్వయంగా మనవడు, మనవరాలికి 'శివ రామ్ కొణిదెల', 'అన్వీర దేవి కొణిదెల' అని నామకరణం చేసిన విషయం అభిమానులకు తెలిసిందే. ఈ పేర్లలో కుటుంబ భావోద్వేగాలు, సంప్రదాయం ప్రతిబింబిస్తాయని ఆయన అప్పుడే వెల్లడించారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన రామ్ చరణ్, పిల్లల పెంపకంపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. "నేను కొంచెం రఫ్‌గా ఉండే తండ్రిని. పిల్లలు పడిపోతే, మట్టిలో ఆడితే, ఎత్తుపల్లాలు ఎక్కినా నేను భయపడను. వాళ్లు ధైర్యంగా, సాహసంగా పెరగాలని కోరుకుంటాను" అని తెలిపారు. అదే సమయంలో, వారి తల్లి ఉపాసన చాలా సున్నితంగా, ప్రేమగా చూసుకుంటుంది. కానీ ఏదైనా రిస్క్ తీసుకోవాలంటే పిల్లలు నా దగ్గరికే వస్తారు అంటూ తన పేరెంటింగ్ స్టైల్‌ను వివరించారు. కుటుంబంతో గడిపే సమయానికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తానని రామ్ చరణ్ స్పష్టం చేశారు. స్టార్‌డమ్ ఎంత ఉన్నా, పిల్లలు పెరుగుతున్న సమయంలో వాళ్లతో ఉండటం చాలా ముఖ్యం. నా ప్రపంచం చాలా చిన్నది.. అది నా కుటుంబం, నా పెంపుడు జంతువుల చుట్టూనే తిరుగుతుంది అని చెప్పారు.

తన తల్లిదండ్రుల నుంచి నేర్చుకున్న విలువలను పిల్లలకు కూడా అందించాలని కోరుకుంటున్నానని చరణ్ వెల్లడించారు. షూటింగ్‌ల మధ్యలో విరామం దొరికినప్పుడల్లా పిల్లలతో గడపడానికి సమయం కేటాయిస్తున్నానని తెలిపారు. ఇక సినిమాల విషయానికి వస్తే, రామ్ చరణ్ ప్రస్తుతం దర్శకుడు బుచ్చిబాబు సాన దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'పెద్ది' చిత్రంతో బిజీగా ఉన్నారు. ఈ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాలో చరణ్ ఒక పెహిల్వాన్ పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తుండగా, శివరాజ్ కుమార్, జగపతి బాబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఏప్రిల్‌లో ఈ మూవీ విడుదల కావలసి ఉండగా, ఇంకా ప్రమోషన్ కార్యక్రమాలు మొదలు పెట్టలేదు. దీంతో చిత్ర రిలీజ్‌పై అనేక సందేహాలు ఉన్నాయి.

## రియల్ హీరో అనిపించిన శివ కార్తికేయన్..



### పరిచయం లేని నటుడికి ఏకంగా రూ.50 లక్షల సాయం

కోలీవుడ్ స్టార్ హీరో శివ కార్తికేయన్ తన మంచి మనసుతో మరోసారి వార్తల్లో నిలిచాడు. సాధారణంగా తను చేసిన మంచి పనులను ఎక్కడా ప్రచారం చేసుకోని ఈ హీరో, అవసరంలో ఉన్నవారికి సైలెంట్‌గా సహాయం చేస్తుంటాడు. తాజాగా అలాంటి ఒక సంఘటన బయటకు రావడంతో ఆయనపై ప్రశంసల వర్షం కురుస్తోంది. తెలుగులో కూడా మంచి ఫ్యాన్ బేస్ సంపాదించుకున్న శివ కార్తికేయన్, 'అమరన్' వంటి సినిమాతో పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు పొందాడు. స్వయం కృషితో ఎదిగిన ఈ హీరోకు సామాజిక స్పృహ ఎక్కువగా ఉండటంతో, తన వంతు సహాయం చేస్తూ ఉంటాడు. ఇటీవల కోలీవుడ్ నటుడు ప్రేమ్ కుమార్ ఒక ఇంటర్వ్యూలో శివ కార్తికేయన్ చేసిన సహాయం గురించి వెల్లడించాడు. ఇద్దరూ కలిసి 'హీరో' సినిమాలో పనిచేసిన సమయంలో జరిగిన ఈ సంఘటనను ఆయన గుర్తు చేసుకున్నాడు. షూటింగ్ సమయంలో తన కుమారుడిని ఉన్నత విద్య కోసం నెదర్లాండ్స్ పంపాలనుకున్నప్పటికీ, అవసరమైన డబ్బులు లేక ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు ప్రేమ్ కుమార్ తెలిపారు. ఇల్లు తాకట్టు పెట్టాలని భావించినా, అది ఈఎంఐలో ఉండటంతో బ్యాంకులు రుణం ఇవ్వడానికి నిరాకరించాయని చెప్పారు. ఈ విషయాన్ని శివ కార్తికేయన్‌కు చెప్పగా, వెంటనే స్పందించిన ఆయన తన పేరుపై పూచీకత్తుగా నిలిచి బ్యాంకు ద్వారా రూ. 50 లక్షల రుణం ఇప్పించాడని ప్రేమ్ కుమార్ వెల్లడించాడు. ఈ సహాయం వల్ల తన కుమారుడు విదేశాల్లో చదువు పూర్తి చేసి, ప్రస్తుతం నెలకు రూ. 4-5 లక్షలు సంపాదిస్తున్నాడని తెలిపారు. అతనితో నాకు పెద్దగా పరిచయం కూడా లేదు. ఒక సినిమా మాత్రమే కలిసి చేశాం. అయినా సరే నా పరిస్థితిని అర్థం చేసుకుని ఇంత పెద్ద సాయం చేశారు. ఆయన నిజంగా గొప్ప మనసున్న వ్యక్తి అంటూ ప్రేమ్ కుమార్ ప్రశంసించారు. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దీనిని చూసిన అభిమానులు శివ కార్తికేయన్‌ను 'రియల్ హీరో' అంటూ కొనియాడుతున్నారు. సినిమా విజయాలకే కాకుండా, మనసు మంచితనంతో కూడా ఆయన ప్రత్యేక గుర్తింపు పొందుతున్నారని కామెంట్స్ చేస్తున్నారు. ఇక సినిమాల విషయానికి వస్తే, హీరోగానే కాకుండా నిర్మాతగానూ బిజీగా ఉన్న శివ కార్తికేయన్, ఇటీవల 'తాయ్ కిళవి' చిత్రంతో నిర్మాతగా కూడా సక్సెస్ సాధించాడు. ప్రస్తుతం ఆయన నటిస్తున్న 'సేయాన్' సినిమా షూటింగ్ దశలో ఉంది.

## చింతామణి సొంత కథ



శ్రీరామ్, మహిమా గుప్త జంటగా నటిస్తున్న చిత్రం 'చింతామణి సొంతకథ'. ప్రేమ్‌రాజ్ దర్శకుడు. బి.రాజీవ్‌కుమార్, రాకేష్ కర్రె, డా.ఎన్వీరావు, శ్రీనివాస్ పసుపులేటి నిర్మాతలు. హైదరాబాద్‌లో ఈ చిత్రం పూజా కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. ముహూర్తపు సన్నివేశానికి ప్రభుత్వ చీఫ్ విప్ అద్దంకి దయాకర్ క్లాప్ ఇవ్వగా, జీహెచ్‌ఎంసీ రిటైర్డ్ అసిస్టెంట్ కమీషనర్ వందనకుమార్ కెమెరా స్విచాన్ చేశారు. సోషల్ యాక్టివిస్ట్ డా.శ్రీనివాస్ తొలిషాట్‌కి గౌరవ దర్శకత్వం వహించగా, నటుడు కాశీ విశ్వనాథ్, రచయిత నివాస్ కలిసి దర్శకుడికి స్క్రిప్ట్‌ని అందించారు. అతిథులంతా చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. కథలోని స్ట్రాంగ్ కంటెంట్ నచ్చి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నట్లు నిర్మాతలు చెప్పారు.

కమర్షియల్ పంథాలో సాగే క్రైమ్ థ్రిల్లర్ ఇదని, ఇందులో భార్యభర్తల డ్రామా ఆసక్తికరంగా ఉంటుందని దర్శకుడు తెలిపారు. ఇంకా చిత్రబృందమంతా మాట్లాడారు.

## సంక్రాంతి 2027కి అనిల్ రావిపూడి మల్టీస్టారర్.. పట్టాలెక్కముందే అమ్ముడైందా?



టాలీవుడ్‌లో వరుస విజయాలతో 'హిట్ మిషన్'గా పేరు తెచ్చుకున్న అనిల్ రావిపూడి మరో క్రేజీ ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. 2027 సంక్రాంతి బరిలోకి ఈసారి మల్టీస్టారర్ చిత్రంతో దిగేందుకు సిద్ధమవుతున్నారు. ఈ సినిమాలో వెంకటేష్, కల్యాణ్ రామ్ కలిసి నటించనుండటం విశేషం. ఈ కాంబినేషన్‌పై ఇప్పటికే ఇండస్ట్రీలో భారీ అంచనాలు నెలకొన్నాయి. హీరోయిన్ల విషయానికి వస్తే, కృతిశెట్టి ఒక కథానాయికగా ఫిక్స్ కాగా, మరో కీలక పాత్ర కోసం కీర్తి సురేష్ పేరును పరిశీలిస్తున్నట్లు సమాచారం. దీంతో ఈ సినిమా కాస్టింగ్ మరింత బలంగా మారుతోంది. ఇంకా షూటింగ్ ప్రారంభం కాకముందే ఈ చిత్రం ఓటీటీ మార్కెట్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ ZEE5 ఈ సినిమా డిజిటల్ హక్కులను భారీ ధరకు దక్కించుకున్నట్లు టాక్ వినిపిస్తోంది. అనిల్ రావిపూడి గత చిత్రాలకు ఓటీటీలో వచ్చిన ఆదరణ దృష్ట్యా ఈ డీల్ రికార్డు స్థాయిలో జరిగినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన స్క్రిప్ట్ పనులు విశాఖపట్నంలో శరవేగంగా కొనసాగుతున్నాయి. ప్రతి సినిమా స్క్రిప్ట్‌ను వైజాగ్‌లోనే పూర్తి చేసే సెంటిమెంట్ ఉన్న అనిల్ రావిపూడి, ఇప్పటికే ఈ సినిమా ఫస్ట్ హాఫ్‌ను లాక్ చేసినట్లు సమాచారం. త్వరలోనే షూటింగ్ ప్రారంభించి, సంక్రాంతి సీజన్‌లో మరోసారి బాక్సాఫీస్ వద్ద సత్తా చాటాలని దర్శకుడు ప్లాన్ చేస్తున్నాడు. ఫ్యామిలీ ఎంటర్టైనర్‌గా తెరకెక్కనున్న ఈ చిత్రం, అనిల్ రావిపూడి స్టైల్ కామెడీ, ఎమోషన్‌తో ప్రేక్షకులను ఆకట్టుకోనుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. స్టార్ హీరోల కలయిక, హిట్ డైరెక్టర్ కాంబో, భారీ ఓటీటీ డీల్ అన్నీ కలిసి ఈ సినిమాను ఇప్పటినుంచే మోస్ట్ అవైటెడ్ ప్రాజెక్ట్‌గా నిలబెడుతున్నాయి. కాగా, అనీల్ రావిపూడి ఇప్పటి వరకు తెరకెక్కించిన అన్ని చిత్రాలు బాక్సాఫీస్ దగ్గర భారీ విజయం సాధించిన విషయం తెలిసందే.

## 100 శాతం బ్రో.. పవన్ కల్యాణ్ అభిమానికి బండ్ల గణేశ్ రిప్లై..!



కమెడియన్‌గా, సపోర్టింగ్ యాక్టర్‌గా, నిర్మాతగా తెలుగు ప్రేక్షకులకు తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు బండ్ల గణేశ్. పవన్ కల్యాణ్, బండ్ల గణేశ్ కాంబో అంటే క్రేజ్ ఎలా ఉంటుందో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. జయంత్ సీ పరాన్జీ డైరెక్షన్‌లో పవన్ కల్యాణ్ నటించిన చిత్రం తీన్‌మార్. బండ్ల గణేశ్ నిర్మించారు. తీన్‌మార్ బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో ఇంప్రెస్ చేయలేకపోయినా మ్యూజికల్ హిట్‌గా నిలువడమే కాకుండా ఓ వర్గం ప్రేక్షకులకు చాలా బాగా కనెక్ట్ అయిందనడంలో ఎలాంటి సందేహం లేదు. గతంలో బండ్ల గణేశ్ ఈ సినిమాను కొన్ని మార్పులతో రీరిలీజ్ చేయాలని హామీనిచ్చాడు. ఇప్పుడిదే కమిట్‌మెంట్‌ను గుర్తు చేస్తున్నారు ఫ్యాన్స్. తీన్‌మార్ నేటితో 15 సంవత్సరాలుపూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా నెట్టింట ఓ అభిమాని పవన్‌కల్యాణ్ బర్త్ డేసందర్భంగా తీన్‌మార్ రివైజ్‌డ్ వెర్షన్‌ను విడుదల చేయాలని బండ్ల గణేశ్‌కు సలహా ఇచ్చాడు. దీనికి బండ్ల గణేశ్ స్పందిస్తూ.. 100 శాతం బ్రో.. అని రిప్లై ఇచ్చాడు. ఈ రీట్వీట్‌తో తీన్‌మార్ మళ్లీ థియేటర్లలో సందడి చేయడం పక్కా అని మరోసారి క్లారిటీ వచ్చేసింది. త్రివిక్రమ్ స్క్రీన్ ప్లే అందించిన ఈ మూవీ ఒరిజినల్ రిలీజైన టైంలో ప్రత్యేకించి డబ్బింగ్ విషయంలో విమర్శలు వచ్చాయి. ఒకవేళ సినిమాలో కొన్నిమార్పుచేర్పులు చేసి రీరిలీజ్ చేస్తే మంచి రెస్పాన్స్ వచ్చే అవకాశాలున్నాయంటున్నారు నెటిజన్లు, సినీ జనాలు. మరి బండ్ల గణేశ్ అభిమానులను దృష్టిలో పెట్టుకొని సినిమాకు కొత్త టచ్ ఏదైనా ఇస్తాడేమో చూడాలి.

# అతిథి పక్షులకు స్వర్గధామం





వరంగల్, : అనేక సంవత్సరాలుగా వేల కిలోమీటర్లు ప్రయాణించి వచ్చే విదేశీ అతిథి పక్షులకు స్వర్గధామంగా మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం మేచరాజుపల్లి నిలుస్తోంది. ప్రకృతి అందాలతో నిండినఈ గ్రామంలోని చెరువులు, చెట్లు వలస పక్షులను అక్కున చేర్చుకుని, ఆశ్రయం ఇచ్చి.. పురుడుపో స్తున్నాయి.అతిథి పక్షులపై మమకారం.. మానవత్వం కురిపిస్తూ.. కరుణిస్తూ.. సంర క్షణ బాధ్యతలను చక్కగా నిర్వర్తిస్తూ.. ఈ ప్రాంతాన్ని విదేశీ పక్షుల పుట్టినిల్లుగా ఏళ్ల తరబడి నిలబెడుతున్న గ్రామస్తులు ఎంతో స్ఫూర్తి నిస్తున్నారు. పక్షుల తల్లిప్రేమను, పిల్లల కేరింతలను, మురిపాలను చూసి సందర్శకులు ఆహ్లాదంతో మంత్రముగ్ధులవుతున్నారు. సైబీరియా వంటి చల్లని ప్రాంతాల నుంచి పక్షులు, ముఖ్యంగా కొంగలు (పెయింటర్ స్టోర్క్) మేచరాజుపల్లికి తరలివచ్చి, నివాసం ఏర్పరచుకోవడం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ప్రతి ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలల్లో వేల సంఖ్యలో సైబీరియన్ కొంగలు, ఇతర వలస పక్షులు చేరుకుంటాయి. చల్లని దేశాల్లో ఉష్ణోగ్రతలు పడిపోవడంతో వేడి ప్రాంతాల కోసం ఈ పక్షులు వేల కిలోమీటర్ల దూరం ప్రయా ణించి ఇక్కడకు ప్రతి ఏటా క్రమం తప్పకుం డా వస్తాయి.డిసెంబర్ నుంచి జూలై వరకు గ్రామంలోని చెట్లపై గూళ్లు కట్టి గుడ్లు పెట్టి సంతానోత్ప త్తి చేసి, పిల్లలు పెద్దయ్యాక తిరిగి జూలై నెలలో పిల్లలతో కలిసి తమ స్వదేశాలకు వెళ్లిపోతాయి. వీటి ప్రధా న ఆహారం చెరువులోని చేపపిల్లలు. చేప పిల్లలను వేటాడి చెట్లపై నిలువ పెట్టుకోవడం మరో ప్రత్యేకతగా నిలుస్తోంది.మేచరాజుపల్లి చెరువు పరిసర ప్రాంతాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో పక్షుల కిలకిలారావాలు వినిపిస్తూ సందర్శకులను ఆకట్టుకుంటాయి. గుంపులుగా ఎగిరే పక్షు లు ఆకాశంలో అద్భుత దృశ్యాన్ని సృష్టిస్తా యి. ఈ కాలంలో చెట్లపై కనిపించే వందలాది విదేశీ అతిథి పక్షులను చూసేందుకు సమీప ప్రాంతాల నుంచి ప్రజలు తరలివస్తుంటారు.గ్రామస్థులు ఈ పక్షులను తమ అతిథులుగా భావించి, సంరక్షణ చర్యలు చేపడుతు న్నారు. ప్రతి ఏడాదీ వచ్చే విదేశీ అతిథి పక్షు ల రాక కోసం నిరీక్షించడం, చెట్లను నరకకుండా కాపాడటం, పక్షులకు ఇబ్బంది కలి గించకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇలా అతిథి పక్షులపై మమకారం.. మానవత్వం కురిపిస్తూ.. కరుణిస్తూ.. సంరక్షణ బాధ్యతలను తు.చ తప్పకుండా నిర్వర్తిస్తూ.. ఈ ప్రాంతాన్ని విదేశీ పక్షుల ఆవాసంగా ఏళ్ల తరబడి నిలబెట్టుతున్నారు.ఒక్కో పక్షి మూడు నుంచి నాలుగు గుడ్లు పెట్టి, 30 నుంచి 45 రోజుల పాటు పొదుగుతుంటాయి. జన్మించిన తమ పిల్లలకు ఇక్కడే ఎగరడం, మేత మేయడం, ఆహారాన్ని సంపాదించడం తదితర నైపుణ్యాలను తల్లి పక్షులు నేర్పిస్తుంటాయి. ఈ ప్రకృతి విన్యాసాలను, తల్లిప్రేమను, పిల్లపక్షుల కేరింతల ను, మురిపాలను చూసి సందర్శకులు ఆహ్లాదంతో మంత్రముగ్ధులవుతుంటారు. ప్రకృతి అందాలు, విదేశీ వలస పక్షుల సందడి కారణంగా మేచరాజుపల్లి పర్యాటక కేంద్రంగా మారే అవకాశాలు మెండుగా ఉన్నాయి. సరైన మౌలిక సదుపాయాలు కల్పిస్తే పక్షి ప్రేమికులకు, ప్రకృతి సందర్శకులకు ఆకర్షణీయ ప్రాంతంగా అభివృద్ధి చెం దుతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. పక్షుల సంరక్షణకు చెరువు అభివృ ద్ధి, చెట్ల సంరక్షణ, పర్యాటక సదుపాయాల కల్పన వంటి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.పర్యావరణ పరిరక్షణ తో పాటు పర్యాటకాభివృద్ధి జరిగితే మేచరాజుపల్లి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందే అవకాశం ఉంది. వేల కిలోమీటర్ల ప్రయా ణం చేసి వచ్చే అతిథి పక్షులతో మేచరాజుపల్లి ప్రకృతి సోయగంగా మారుతూ నిజమై న పక్షుల స్వర్గధామంగా నిలుస్తోంది

## బిఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం



కొమురవెల్లి (తెలంగాణ వాణి ప్రతినిధి) సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండల కేంద్రంలో బి ఆర్ ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం ఘనంగా ప్రారంభించారు. ఈ చలివేంద్రాన్ని జనగామ శాసనసభ్యులు డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు.

ఎండ తీవ్రత రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిన బి ఆర్ ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రాజేందర్ రెడ్డిని జనగామ శాసనసభ్యులు పల్లా రాజేశ్వర్ రెడ్డి అభినందించారు. వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చే ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఎంతో ఉపయోగకరమని ఆయన పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీకి నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. స్థానిక ప్రజలు కూడా చలివేంద్రం ఏర్పాటు పట్ల హర్షం వ్యక్తం చేస్తూ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

### డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆశయాల సాధనకు..

# ప్రతి ఒక్కరు కృషి చేయాలి

**-అంబేద్కర్ చూపిన దారిలోనే దేశ భవిష్యత్ నిర్మాణం**
**-ఆశయాల అమలే నిజమైన ఘన నివాళి**
**-జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్**





ములుగు,ఏప్రిల్14(తెలంగాణ వాణి):డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ ఆశయాల కృషికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆయన చూపిన దారిలోనే ప్రజాస్వామ్య భవిష్యత్తు నిర్మాణమైనదని,మహోన్నత వ్యక్తుల ఆశయాలను అమలు చేయడమే,నిజమైన ఘన నివాళి అని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. మంగళవారం భారత రాజ్యాంగ నిర్మాత భారతరత్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 135వ జయంతి ఉత్స వాల సందర్భంగా ములుగు జిల్లా కేంద్రంలో బస్టాండ్ కూడలి వద్ద ఉన్న డా బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ సమావేశం మందిరంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 135వ జయంతి ఉత్సవాల కార్యక్రమాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై సభాస్థలి సమావేశం మందిరంలో ఏర్పాటుచేసిన భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల ఘటించి జ్యోతి ప్రజ్వనలతో ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్.మాట్లాడుతూ భారతరత్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ దేశానికి చేసిన సేవలు, రాజ్యాంగ నిర్మాణానికి చేసిన కృషిమరువలేనివని,అంబేద్కర్ ఘన కీర్తి ప్రపంచ నలుమూలల వ్యాప్తి చెందడంతో పాటు ప్రపంచానికే మార్గదర్శిగా నిలిచారని కొనియాడారు. డాక్టర్ అంబేద్కర్ దేశానికి చేసిన సేవలు, సామాజిక న్యాయం కోసం చేసిన అసాధారణ కృషి చిరస్మరణీయమైనవని, సమానత్వం, స్వాతంత్ర్యం, సౌభ్రాతృత్వం అనే రాజ్యాంగ విలువలను ప్రతి పౌరుడూ జీవితంలో ఆచరించాలని పిలుపునిచ్చారు.చదువు, సమీకరించు, పోరాడు అనే నినాదాలతో యువత ముందుకు రావాలని, జ్ఞానం లేని పోరాటం దిశ లేని ప్రయాణం వంటిదని అంబేద్కర్ విశ్వసించేవారని వారి బాటలోనే యువత జ్ఞానాన్ని సంపాదించుకోవాలని సూచించారు. అంబేద్కర్ ఆలోచనలు, ఆయన చూపిన మార్గం యువతకు శాశ్వత ఆదర్శంగా నిలుస్తున్నాయని, విద్య మాత్రమే సామాజిక మార్పు సాధ్యం చేస్తుందని,అన్ని వర్గాల ప్రజ అభివృద్ధికి ఆయన చేసిన సేవలు ఎప్పటికీ మరచిపోలేనివి కొనియాడారు.

# అందరివాడు అంబేద్కర్.. కేయు విసి ప్రతాపరెడ్డి






హనుమకొండ (కాకతీయ యూనివర్సిటీ) తెలంగాణ వాణి : కాకతీయ విశ్వవిద్యాలయంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 136వ జయంతి ఘనంగా నిర్వహించబడింది. విశ్వవిద్యాలయ సెనెట్ హాల్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి వైస్ ఛాన్సలర్ ఆచార్య కె. ప్రతాప్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, “అందరి వాడు అంబేద్కర్” అని పేర్కొన్నారు. అంబేద్కర్ గొప్ప ఆలోచనాపరుడు, మార్గదర్శి, బహుముఖ ప్రజ్ఞాశాలి అని కొనియాడుతూ, భారత జాతీయ సంస్థల నిర్మాణంలో ఆయన ఆలోచనలకు కీలక స్థానం ఉందన్నారు. సమాజానికి ఆయన చేసిన నిస్వార్థ సేవలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకుని కృతజ్ఞతాభావంతో ఉండాలని, స్వార్థాన్ని విడనాడాలని సూచించారు. కాకతీయ విశ్వవిద్యాలయం ఉత్తమ విద్యాసంస్థగా నిలుస్తుందని, ఇక్కడ విద్యార్థులు అన్ని విధాలుగా అభివృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. విశ్వవిద్యాలయ అభివృద్ధికి అందరూ సహకరించాలని, జాతీయ స్థాయిలో విశ్వవిద్యాలయాన్ని మరింత ఉన్నత స్థానానికి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. అంబేద్కర్ అధ్యయన కేంద్రాన్ని బలోపేతం చేయడానికి నిధులను పెంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఎన్ఐటీ ఆచార్యులు ఆచార్య ఆనంద కిషోర్ కోలా మాట్లాడుతూ, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఒక మార్పును సృష్టించి ఇతరులను ప్రేరేపించే నాయకుడు అని అభివర్ణించారు. వివక్షలను ఎదుర్కొన్నప్పటికీ ప్రతి పరిస్థితిని సానుకూలంగా స్వీకరించి విజయాన్ని సాధించిన మహనీయుడని తెలిపారు. పీడిత, నిరుత్సాహిత, అణచివేయబడిన వర్గాల కోసం అంబేద్కర్ నిరంతరం పోరాడారని, అవమానాలు మరియు అసమానతలను విద్య ద్వారానే తొలగించవచ్చని ఆయన విశ్వసించారని పేర్కొన్నారు. విదేశీ విద్యను అభ్యసించినప్పటికీ దేశ అభ్యున్నతి కోసం స్వదేశానికి తిరిగి వచ్చారని తెలిపారు. ఆయన భారతదేశానికి దిక్సూచి లాంటివారని, తన శక్తి, సామర్థ్యాలతో దేశ దిశ, దశలను మార్చారని అన్నారు. ఉపాధ్యాయ వృత్తి గొప్పదని, పరిశోధకులు కొత్త అంశాలపై పరిశోధనలు చేయాలని సూచించారు. ప్రతి పనిలో పరిపూర్ణత ఉండాలని, చట్టం ముందు అందరూ సమానమని చెప్పారు. సమాజానికి సేవ చేయడం ప్రతి మేధావి బాధ్యత అని తెలిపారు. బలహీన వర్గాల బలోపేతానికి విద్యే ప్రధాన మార్గమని అన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం మాట్లాడుతూ అంబేద్కర్ అన్ని వర్గాల ప్రజలకు ఆదర్శప్రాయుడని, నేటి స్వేచ్ఛ ఆయన కృషి ఫలితమని పేర్కొన్నారు. ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ ఆచార్య బి. వెంకట్రామరెడ్డి అంబేద్కర్ గొప్ప దేశభక్తుడని, ఆయన ఆశయాలను యువత కొనసాగించాలని అన్నారు. సభాధ్యక్షులు డాక్టర్ ఎ. రాజు మాట్లాడుతూ విశ్వవిద్యాలయ ఎస్ సి/ఎస్ టి సెల్ సమర్థవంతంగా పనిచేస్తూ విద్యార్థులు, ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడుతోందని తెలిపారు. ఎస్ సి/ఎస్ టి ఉద్యోగ సంఘ కార్యదర్శి డాక్టర్ పుల్ల శ్రీనివాస్, సంఘ అధ్యక్షులు ఆచార్య ఈసం నారాయణ మహానుభావులను గౌరవించాలని, నిధులను సమర్థంగా వినియోగించాలన్నారు. పాలక మండలి సభ్యులు ఆచార్య సురేష్ లాల్ అంబేద్కర్ గొప్ప ఆర్థిక శాస్త్రవేత్త అని, ద్వేషానికి స్థానం లేదని అన్నారు. కే. అనితా రెడ్డి ప్రతి మనిషిని గౌరవించాల్సిన అవసరం ఉందని, స్వాభిమానానికి ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. డాక్టర్ రమ యువత మనసును అభివృద్ధి చేసుకోవాలని, మంచి ఆలోచనలు పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముందు ఆడిటోరియం ప్రాంగణంలోని అంబేద్కర్ విగ్రహానికి వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్ మరియు ఇతర అధికారులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

# అంబేద్కర్ చూపిన మార్గం సమాజానికి దిశానిర్దేశం

**వెలిచాల రాజేందర్ రావు**
**డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి ఘన నివాళి**





కరీంనగర్ (తెలంగాణ వాణి) రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి పురస్కరించుకొని మంగళవారం కరీంనగర్ కోర్టు చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజేందర్ రావు మాట్లాడుతూ సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం అనే మహత్తర విలువలను మన రాజ్యాంగం ద్వారా అందించిన మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చూపిన మార్గం సమాజానికి ఎల్లప్పుడూ దిశానిర్దేశం చేస్తూనే ఉంటుందని పేర్కొన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం కోసం అంబేద్కర్ స్ఫూర్తితో ప్రజా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఆకులు నర్మద నరసన్న, పడాల శ్రీజ అజయ్ నాయకులు గసికంటి కుమార్, వేల్పుల వెంకటేష్, గండి గణేష్, గండి శ్యామ్, మేడి అంజయ్య తీట్ల ఈశ్వరి, అంబేద్కర్ సంఘం నాయకులు పాల్గొన్నారు.



### అగ్ని మాపకశాఖ నియమాలు పాటిస్తూ ప్రమాదాలు జరగకుండా..

# తగిన జాగ్రత్తలు పాటించాలి

**– జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్**



ములుగు, ఏప్రిల్14(తెలంగాణ వాణి): అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరం నందు అగ్ని నివారణ పట్ల అవగాహన పోస్టర్లను జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 1944 ఏప్రిల్ 14వ తేదీన ముంబాయి డాక్ యార్డులో ఒక నౌకకు అగ్ని ప్రమాదం సంభవించి విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన 66మంది అగ్ని మాపక దళ సిబ్బందిని స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం ఏప్రిల్ 14 నుండి 20వ తేదీ వరకు దేశవ్యాప్తంగా అగ్నిమాపక దళ వారోత్సవాలు నిర్వహించబడుతున్నాయి.హోటళ్లలో అగ్నిమాపక పరికరాలు అన్ని వేళలా పని చేసేలా ఉంచాలని, ప్రతి అంతస్తులో మెట్ల ద్వారాలు, అగ్నిమాపక పరికరాల స్థానం తెలిపే ఎస్కేప్ ప్లాన్ ఉంచాలని తెలిపారు. ఎయిర్ కండిషనర్ ద్వారా మంటలు వ్యాప్తి చెందకుండా డ్యాంపర్స్ ఏర్పాటు చేయాలని వాటిని ఆటోమేటిక్ డిటెక్టివ్ సిస్టంకు అనుసంధానం చేయాలని సూచించారు. విద్యుత్ వైరింగ్, స్విచ్ లు ఇతర పరికరాలు క్రమం తప్పకుండా చెక్ చేసుకోవాలని ఏమైనా లోపాలు ఉంటే సరి చేసుకోవాలని అన్నారు. సిబ్బంది అందరికీ హోటల్ ఎక్విప్మెంట్ పై శిక్షణ ఇవ్వాలని తెలిపారు. తరచూ మాక్ డ్రిల్స్ నిర్వహించాలని అగ్నిప్రమాద లాంటి అత్యవసర సమయంలో ఏ విధంగా ప్రవర్తించాలో శిక్షణ ఇవ్వాలని పేర్కొన్నారు. వంట గదిలో అగ్నిప్రమాదం జరగకుండా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ముఖ్యంగా ఎల్పిజి, సిలిండర్లో ఇతర వస్తువులు భద్రపరిచే చోట తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. హోటల్లో బస చేసే ముందు అని జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యంగా ప్రమాద సమయంలో బయటకు వెళ్లే మార్గాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

Printed, Published & Owned by JERIPOTHULA SAMPATH, Printed at SRI BALAJI, H.No. 4-4-85, Tilak road, District Karimnagar. 505 001 (T.S)Published at H.No. 3-6-307, Subhash Nagar, Karimnagar
MDI: District, Karimnagar -505 001 (T.S) Editor: JERIPOTHULA SAMPATH, RNI NO. APTEL/2012/53127 CELL:9912758107, telanganavanil@gmail.com